జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 04 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 88 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: ప్రథమ - 16:40:04 వరకు నక్షత్రంజ్యేష్ఠ - 19:09:15 వరకు కరణంకౌలవ - 16:40:04 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 06:18:08 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

### సుప్రీకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ,జూన్3(ప్రజాజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను

మిగతా1 2లో..

## నేడు సీఎం రేవంత్ రెడ్డి మఖ్తల్ లో పర్యటన

సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



4 లో

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

### ఉపముఖ్యమంత్రిగా పరమేశ్వర్ ప్రమాణం

### మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం

### సిద్ధరామయ్య, ఖర్గే తనయులకు కేబినేట్‌లో చోటు

### హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



బెంగళూరు,జూన్ 3(ప్రజాజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం



చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర,

మిగతా 2లో..



# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

### టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

### యువతలో నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్

హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభి వృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహ కారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని.. ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ

మిగతా 2లో..

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి
- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి

మిగతా 2లో..

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

న్యూఢిల్లీ,జూన్3(ప్రజాజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది.

మిగతా 2లో..



## ఆదాయానికి మించి ఆస్తులు

మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు అరెస్ట్

ఫోన్ ట్యాపింగ్‌లో మరో పరిణామం

అడిషనల్ ఎస్పీ ఇంట్లో ఏసిబి సోదాలు

తీగల, లంకల దీపక్‌రెడ్డిలో సిట్ నోటీసులు



హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావును ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ సోదాల్లో ఆయనకు సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో కమర్షియల్ భవనం, కిలో బంగారు

మిగతా 2లో..

## రసవత్తరంగా బెంగాల్ రాజకీయాలు

రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా

స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ

కోల్‌కతా,జూన్ 3(ప్రజాజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష నేత

మిగతా 2లో..

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అననం తినలేదన్నావ్
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
- మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
- ప్రెస్‌క్లబ్‌లో పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు హెచ్చరిక
- వచ్చే ఏడాది ఖచ్చితంగా రాష్ట్రంలో పాదయాత్ర చేస్తా
- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ రాష్ట్రంలో అప్పలపై చర్చకు సిద్ధమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్



హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా

మిగతా 12లో..



# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

### జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

### మార్కెట్ రేట్ల మేరకు సవరణలు: పొంగులేటి

హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ ,

మిగతా 2లో..




# సంపాదకీయం

## మమత కోటకు బీటలు!

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ది చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుంటున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

మొదటిపేజీ తరువాయి..

ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం




రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన.. తురింగియా సీఎం మారియో వోయిట్.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..


చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.



## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

మొదటిపేజీ తరువాయి..

రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.



## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు

కరీంనగర్,జూన్3(ప్రజాజ్యోతి): రైతులు పంట అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలిపి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని వాటిపై రైతులు మొగ్గు చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరి రైతు వేదికలో సర్పంచ్ జంగ శిరీష అధ్యక్షతన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పంట అవశేషాలు దహనం వల్ల నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి నేల సారం తగ్గిపోవడంతోపాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. నేల పరీక్షల ఆధారంగా మాత్రమే పంటలను రైతులు వినియోగించాలన్నారు. యూరియా అధికంగా వాడటం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు భూసారం దెబ్బతింటుందని అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు వేయాలని, సన్న రకాల వరి వంగడాల సాగుపై దృష్టి సారించాలన్నారు. జీవామృతం, ఘనజీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు. పంటల సాగులో ఏఈఓల సలహా, సూచనలను రైతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పశువైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రణయ్, రాకేష్, అఖిల, సౌమ్య, అంజలి రైతులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

మొదటిపేజీ తరువాయి..

నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

## రసవత్తరంగా బెంగాల్ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

హోదా ఇస్తూ స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కేటాయించిన ఛాంబర్ తాళాలను కూడా సిబ్బంది రితబ్రతకు ఇచ్చేశారు. అసెంబ్లీలో పార్టీ నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ను తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ ఎంపిక చేయడంతో పార్టీలో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఆయన నాయకత్వాన్ని అంగీకరించబోమంటూ మొత్తం 80 ఎమ్మెల్యేల్లో 59 మంది తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. ఆ తరువాత రితబ్రత సారథ్యంలో రెబల్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిశారు. తామే టీఎంసీ అని, రితబ్రతకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని లేఖను సమర్పించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ తాజాగా రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే, తమ నాయకురాలు మమతా బెనర్జీనేనని రితబ్రత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకు పార్టీని చీల్చే ఉద్దేశం ఎంతమాత్రం లేదని అన్నారు. శోభన్‌దేబ్‌ను ప్రతిపక్ష నేతగా గుర్తించాలంటూ గత వారం టీఎంసీ అధినేత్రి మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. కానీ, స్పీకర్ ఈ లేఖను తిరస్కరించారు. ఈ లేఖలోని తమ సంతకాలను ఫోర్జరీ చేశారని ఎమ్మెల్యేలు రితబ్రత, సాందీపన్ ఆరోపించడంతో స్పీకర్ శోభన్‌దేబ్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు.

## ఆదాయానికి మించి ఆస్తులు


మొదటిపేజీ తరువాయి..

నగలు, బ్యాంకు ఖాతాలో రూ.3.83 లక్షలున్నట్లు తేలింది. సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన సొత్తును గుర్తించారు. 29 మద్యం సీసాలు కూడా లభించడంతో ఏసీబీ అధికారులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి. రెండు మూడు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది సిట్. 2014-18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా ఉన్నారు తీగల కృష్ణారెడ్డి.

## తెలంగా ఇన్ సర్వీస్ టీచర్లకు శుభవార్త

### వారి కోసం ప్రత్యేక టెట్ నిర్వహణ

హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్‌న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు వెదురు మొక్కల పంపిణీ





**నేరడిగొండ జూన్ 03 (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని తేజపురం గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్‌లో బుధవారం (లేదా ఈరోజు) ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు 'బాంబో ప్లాంటేషన్' (వెదురు సాగు) విశిష్టత, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి అధికారులు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాంబో ప్లాంటేషన్ అధికారి విఘ్నేశ్వరరావు మాట్లాడుతూ... గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ వెదురు కుప్పల (వెదురు గూడు) నుండి తలాలా 60 మొక్కల చొప్పున ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెదురు మొక్కలను నాటి, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తేజపురం గ్రామ సర్పంచ్ సింగరి వసుంధర నవీన్, వెలుగు సీసీ రాథోడ్ విజయ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లుగా ఎంపికైన యువకులకు ఘన సన్మానం

- దేశసేవకు ఎంపికైన మహేష్, విశ్వకు అభినందనలు
- శాలువాతో సత్కరించిన గ్రామస్తులు



**కేరమరి జూన్ 3 ప్రజా జ్యోతి :** కెరమెరి మండలానికి చెందిన ఇద్దరు యువకులు భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికై దేశసేవకు సిద్ధమయ్యారు. స్వాంగి గ్రామానికి చెందిన మొహర్లె మహేష్, గోయాగాం గ్రామానికి చెందిన సొనుర్లె విశ్వ అగ్నివీర్‌గా ఎంపికయ్యారు. విశ్వ తండ్రి సొనుర్లె బాపుజీ, తల్లి గంగుబాయి. గ్రామస్తులు మాట్లాడుతూ సాదరన వ్యవసాయము కుంటుంబానికి చెందిన పట్టుదలతో శ్రమించిన గ్రామిన యవకుడు అగ్నివీర్ ఎంపిక కావడం చాల ఆనందంగా ఉంది ఈ సందర్భంగా మండల కేంద్రంలో బుదవారము గ్రామస్తులు సుధాకర్, నాగార్జున్, శుభం, చంద్రశేఖర్, ప్రశాంత్ ఇద్దరు యువకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. దేశ సరిహద్దుల్లో సేవ చేసే అవకాశం రావడం తో గర్వకారణమని, యువతకు వీరు ఆదర్శంగా నిలుస్తారని సన్మాన కర్తలు కొనియాడారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా దశలవారీ పోరాటం
- శ్రీరాంపూర్ ఏరియాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన
- గని మేనేజర్లకు వినతిపత్రాల సమర్పణ



**మంచిర్యాల, 3, జూన్ (ప్రజాజ్యోతి) :** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధినాయకత్వం పిలుపు మేరకు సింగరేణిలో కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గని మేనేజర్లకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల పెండింగ్ సమస్యలు, సంక్షేమ అంశాలు, ఉద్యోగ భద్రత, ఖాళీ పోస్టుల భర్తీ, పదోన్నతులు, కార్మికులకు సంబంధించిన వివిధ డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్కే న్యూటెక్ గనిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ నాయకుడు ఎండి లాల, ఫిట్ సెక్రెటరీ జైపాల్ రెడ్డి, దేవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, ఫిట్ సెక్రెటరీ గడ్డం సుధాకర్, జంగా రమేష్, పవన్, సదానందం పాల్గొన్నారు. ఆర్కే-5 గనిలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేష్, ఫిట్ సెక్రెటరీ దుర్గం రవికుమార్, పాపిరెడ్డి, చంద్రగిరి మల్లేష్, చిప్ప రమేష్, ఉడాల మల్లేష్ పాల్గొన్నారు. ఆర్కే-7 గనిలో కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఫిట్ సెక్రెటరీ రాజు నాయక్, తొంగల రమేష్, పాదం శ్రీనివాస్, గురుమూర్తి, ప్రమోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎస్ఆర్పీ-1 గనిలో ఫిట్ సెక్రెటరీ కుర్మా వికాస్, సముద్రాల అన్వేష్, శ్రీనివాస్, కాసరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఎస్ఆర్పీ-3 గనిలో ఏరియా సెక్రెటరీలు సాదుల భాస్కర్, ఉత్తేజి రెడ్డి, తౌటం నరేష్, జంగా తిరుపతి రెడ్డి, పానుగంటి వినయ్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ సీఎస్పీలో ఏరియా సెక్రెటరీ బుస్సా రమేష్, ఫిట్ సెక్రెటరీ అందే రాజకుమార్, కాసర్ల లక్ష్మణ్, సమ్మయ్య, ఎండి ఫకుర్ పాల్గొన్నారు. ఇందారం గని, ఓసీలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జావిద్ పాషా, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అన్వేష్ రెడ్డి, ఏరియా సెక్రెటరీ గొర్ల సంతోష్, ఫిట్ సెక్రెటరీలు గడ్డం మల్లన్న, ధరణి మధుకర్, గోగర్ల గోపాల్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య





### బడిబాట ర్యాలీలో సర్పంచ్ ఏలేటి నీలిమ

**నేరడిగొండ, జూన్ 03 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో బుధవారం 'బడిబాట' కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామసభ, అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ.. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక కృషి ఫలితంగా వచ్చే విద్యాసంవత్సరం నుండి ఈ పాఠశాల 'పబ్లిక్ స్కూల్'గా రూపాంతరం చెందబోతుందని హర్షం వ్యక్తం చేశారు. నర్సరీ నుండి 12వ తరగతి వరకు పూర్తి స్థాయి ఇంగ్లీష్ మీడియంలో, ఆధునిక వసతులతో బోధన సాగనుందని వివరించారు. కావున మండల ప్రజలు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లకుండా, సకల సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగామణి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఖానాపూర్ కొత్తపేటలో నూతన గ్రామ పంచాయతీ

# కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ఖానాపూర్ జూన్ 3(ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ మండలం కొత్తపేట గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం ప్రారంభించారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని గ్రామస్థాయి నుంచి పట్టణ మండల జిల్లా స్థాయిలో ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్న తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ 24 గంటలు ప్రజా సమక్షంలోనే ఉంటుందన్నారు అనంతరం కొత్తపేటసర్పంచ్ నీ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పతకాలను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు చేప ట్టాలని సూచించారు. మహిళా సంఘం ద్వారా భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ ఖానాపూర్ పట్టణ కౌన్సిలర్లు రాజు రా సత్యం నిర్మల రమేష్ లక్ష్మీపతి గౌడ్ మండల తాసిల్దార్ సుజాత మండల అభివృద్ధి అధికారి రాథోడ్ రాధా ఎంపీఓ చిక్యాల రత్నాకర్ రావు ఎంఈఓ సంధ్యారాణి గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలి





- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**మంచిర్యాల, 3, జూన్ (ప్రజాజ్యోతి) :** గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు . ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో డివిజన్, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత అంశాలపై సభల్లో విస్తృతంగా చర్చించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టాలని, భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలు, రెస్క్యూ బృందాలను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభలు, వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖతో సమన్వయం చేస్తున్నామని, పారిశుద్ధ్య కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. నాలుగు రోజులపాటు జరిగే సభలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ప్రణాళిక శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక మహిళలకు 31 రకాల వైద్య పరీక్షలు

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హాజీపూర్‌లో డెమో కార్యక్రమం ప్రారంభం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత





**మంచిర్యాల, 3, జూన్ (ప్రజాజ్యోతి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళా సభ్యులకు నిర్వహించనున్న వైద్య పరీక్షల కార్యక్రమానికి హాజీపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డెమో, అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని మందమర్రి, కాసిపేట్, హాజీపూర్, దండేపల్లి, జైపూర్ మండలాల స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు బుధవారం నుంచి 31 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు .రోజుకు 50 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వెలుగు వివో గ్రూపుల ద్వారా మహిళల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేయడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా జిల్లాలో కొనసాగుతున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రంలో ఓఆర్ఎస్-జింక్ కార్నర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మహిళా సభ్యులందరికీ సకాలంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ తిరుపతి, డీపీఓ ప్రశాంతి, డీపీహెచ్ఎన్ ఆర్.ఎస్. పద్మ, మార్తా, రఘుపతి, డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం వెంకటేష్, డీడీఎం భాగ్య, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



## నేరడిగొండ నూతన రెవెన్యూ అధికారులకు ఘన సన్మానం



**నేరడిగొండ, జూన్ 3 (ప్రజా జ్యోతి) :** నేరడిగొండ మండల తహసీల్దార్ కార్యాలయానికి నూతనంగా బదిలీపై వచ్చిన రెవెన్యూ అధికారులను బుధవారం ఘనంగా సన్మానించారు. లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో నూతన ఆర్ఐలు సాయిరాం, మమత, సీనియర్ అసిస్టెంట్ యాస్మిన్ లను శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమైన ప్రక్రియేనని, అయితే ప్రజాసేవలో భాగస్వాములు అయ్యే అదృష్టం, అవకాశం కేవలం ప్రభుత్వ అధికారులకే దక్కుతుందని కొనియాడారు. నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసే అధికారుల సేవలను ప్రజలు ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటారని గుర్తుచేశారు. "మండల సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్క అధికారి నిరంతరం పాటుపడాలి. ప్రజలకు సేవ చేయడంలో అధికారులకు ప్రజాప్రతినిధులుగా మేము ఎల్లవేళలా అండగా ఉంటాం." మహేందర్ జాదవ్, లైవ్ జిల్లా అధ్యక్షుడు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జగన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే





**నేరడిగొండ, జూన్ 03 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన వాంకిడి పోతారెడ్డి మాతృమూర్తి, అలాగే గడ్డం రమణ రెడ్డి మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ అనిల్ జాదవ్ బుధవారం వారి నివాసాలను సందర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి, తమ గాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ నవీన్, శ్రీకాంత్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, శోభన్ రెడ్డి, లక్ష్మణ్, విద్యాసాగర్ రెడ్డి, ప్రదీప్, లడ్డు, పోతారెడ్డి, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డిలతో పాటు పలువురు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సోనాల మండలంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శ



**సోనాల, జూన్ 03 (ప్రజాజ్యోతి) :** సోనాల మండలంలోని సంపత్ నాయక్ తాండ గ్రామానికి చెందిన రాథోడ్ తుకరాం భార్య ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈరోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సకారం, సుధీర్ రెడ్డి, రాంకిషన్, బాబులాల్, రవీందర్ జాదవ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఈశ్వర్, ఆసీఫ్, రమణ, ప్రదీప్, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె హరిత





**కొమురం భీం జిల్లా ప్రతినిధి (వాంకిడి) జూన్ 03 ప్రజా జ్యోతి :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ కె హరిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నీటి పారుదల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, పంచాయతీ రాజ్ భవనాల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలనను పాటించాలన్నారు. నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో మాట్లాడుతూ చెరువులు కాలువల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎలాంటి ఆటంకం కలగకుండా సాగునీటిని అందించాలని కోరారు. కాలువలలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా చూడాలని, కాలువల తూముల మరమ్మత్తులు చేయాలన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తనిఖీలో కార్యాలయాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు

- వానాకాలం సీజన్‌కు ముందే అప్రమత్తం కావాలి
- యూరియా దుర్వినియోగంపై ప్రత్యేక నిఘా: కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

వనపర్తి ప్రతినిధి, జూన్ 3 (ప్రజాజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన





ఎరువులు, విత్తనాల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని, వరి సాగు చేసే రైతులు సన్న రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, దొడ్డు రకాలతో పాటు డిఎయన్–75 రకం వరిని సాగు చేయకుండా చైతన్యం కల్పించాలని తెలిపారు. ఈ రకం ధాన్యానికి మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. యూరియా వినియోగంపై కూడా ప్రత్యేక నిఘా పెట్టాలని, గతంలో అధికంగా యూరియా కొనుగోలు చేసిన వారి వినియోగాన్ని పరిశీలించి, పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్వో సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యేకు విశేష స్పందన

- ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం
- గంటలో 158 కాల్స్.. 79 మందితో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే

వనపర్తి, జూన్ 3 (ప్రజాజ్యోతి): వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో బుధవారం "వే టు న్యూస్" ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం గంట వ్యవధిలోనే మొత్తం 158 ఫోన్ కాల్స్ అందగా, అందులో 79 మంది ప్రజలతో



ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమయం పరిమితి కారణంగా మిగిలిన 79 కాల్స్‌కు స్పందించలేకపోయారు. ఈ సందర్భంగా ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, రోడ్ల సమస్యలు, విద్యుత్ సరఫరా, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గంటపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రజలు తమ స్థానిక సమస్యలను ఎమ్మెల్యేతో నేరుగా పంచుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వే టు న్యూస్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే మేఘారెడ్డి అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.బుధవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ప్లాస్టిక్ కాలుష్యం భూమి,నీరు,జీవ వైవిధ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న నేపథ్యంలో



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు.పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలైన గుడ్డ సంచులు,స్టీల్ బాటిళ్లు,గాజు సీసాలు,వెదురు ఉత్పత్తులు,ఆకు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.తడి చెత్త,పొడి చెత్త,శానిటరీ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి పారవేయడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని తెలిపారు."తగ్గిద్దాం–తిరిగి వాడుదాం –పునర్వినియోగం చేద్దాం"అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన,పచ్చదనంతో కూడిన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం,ప్లాస్టిక్ నిర్మూలన,వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి కార్యక్రమాల్లో ప్రజలందరూ చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు."మన భూమి–మన బాధ్యత"అనే భావనతో ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో తనవంతు పాత్ర పోషించినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఓ పాపయ్య,సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డా.విద్యులత తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటితేనే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్‌తో చైతన్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూన్ 3 (ప్రజాజ్యోతి): ప్రజల్లో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచి రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ స్థానికులతో కలిసి ఎకో పార్కులో సుమారు ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. అడవుల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల్లో అడవుల పెంపకంపై విస్తృత అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లతో పాటు అటవీశాఖ పరిధిలోని చెక్‌డ్యాంలు, కుంటలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పర్యావరణ వారోత్సవాలు, ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఎకో పార్కులో సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మొక్కలు నాటడంపై






ప్రజల్లో చైతన్యం పెంచి జిల్లాలో అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చిత్ర ప్రదర్శన ద్వారా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, డీపీఆర్వో సీతారాం, డీవైఎస్‌వో సుధీర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

- జడ్చర్ల సభా ప్రాంగణం, ఉదండాపూర్-కరివెన రిజర్వాయర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జూన్ 5న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల త్రి జూపల్లి





కృష్ణారావు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్త, జిల్లా ఎస్పీ దరావత్ జానకి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఓఎస్డీ కమలాసన్ రెడ్డి తదితరులతో కలిసి జడ్చర్లలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సభా ప్రాంగణం పరిసరాల పరిశుభ్రత, వేదిక నిర్మాణం, టెంట్ల ఏర్పాటు, ప్రజల కోసం సీటింగ్ సదుపాయాలు, త్రాగునీటి వసతి, వాహనాల పార్కింగ్, ప్రత్యేక వీఐపీ గ్యాలరీలు, పోలీస్ బందోబస్తు, బ్యారికేడ్ల ఏర్పాట్లు తదితర అంశాలను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకితో కలిసి ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద హెలిప్యాడ్ల నిర్మాణం, వ్యూ పాయింట్ వద్ద బారికేడ్ల ఏర్పాటు, పోలీస్ భద్రత, వాహనాల పార్కింగ్, టెంట్లు, త్రాగునీటి సదుపాయం, వీఐపీ గ్రీన్ రూములు, మరుగుదొడ్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌తో పాటు మంత్రుల హెలికాప్టర్లు దిగేందుకు రెండు హెలిప్యాడ్లను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భద్రతా దృష్ట్యా వ్యూ పాయింట్ వద్ద డబుల్ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కరివెన రిజర్వాయర్ వద్ద కూడా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ల నిర్మాణం, రిజర్వాయర్ కట్టపై వ్యూ పాయింట్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వీఐపీలు మరియు మీడియా ప్రతినిధుల కోసం భోజన వసతులు, సమీక్ష సమావేశ ఏర్పాట్లు తదితర అంశాలను అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, అటవీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అగ్నిమాపక శాఖ రెండు ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ శాఖ నిరంతరాయ విద్యుత్ కోసం జనరేటర్లు ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ సమావేశ ప్రాంగణంలో కోతులు, తేనెటీగలు, పాములు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన

-జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక

-పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి: కలెక్టర్ ప్రియాంక

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 03 (ప్రజా జ్యోతి): 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా చేపట్టనున్న "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట"కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాలను ప్రతి కుటుంబానికి చేరవేసి, పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో కనీసం 10 శాతం అధికంగా విద్యార్థుల నమోదును పెంచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేశారు. బడిబాట కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు విస్తృతంగా నిర్వహిస్తూ, తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను వివరించాలని సూచించారు.




అదేవిధంగా జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలను పునరుద్ధరించి తిరిగి విద్యా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా హక్కు ప్రతి చిన్నారికి అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల నమోదు విస్తరణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎం. గోవిందరాజులు,సీఎంఓ రాజేంద్ర కుమార్, ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ నాగార్జున రెడ్డి, ఉల్లాస్ కోఆర్డినేటర్ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఈ నెల 4న జిల్లాలో జరుగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ధరూర్ మండలంలోని గుడ్డం దొడ్డి రిజర్వాయర్ వద్ద రెండు హెలిప్యాడ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి,మంత్రులకు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.పంప్ హౌస్‌లో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించనున్నందున వేదికతో పాటు ఇతర అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ బృందం,అంబులెన్స్‌లు,అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు



సంబంధించిన పూర్తి వివరాలతో నోట్స్ సిద్ధం చేసుకోవడంతో పాటు ప్రాజెక్టుల ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఎక్కడా విద్యుత్ తీగలు కిందకు వేలాడకుండా ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పర్యటనలో విధులు నిర్వహించే అధికారులు,సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్



మధుమోహన్,ఆర్డీఓ శ్రీనివాసరావు,డీఎస్పీ మొగిలయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు సీఎం రేవంత్ రెడ్డి మఖ్తల్ లో పర్యటన

-సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 03 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణం మరియు కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో గల మఖ్తల్, నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఏరియల్ సర్వే,పనులను పరిశీలించడం కోసం రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ఈ సందర్భంగా మఖ్తల్ లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు,సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పోలీసులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా,వికారాబాద్, సంగారెడ్డి,సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుండి వచ్చిన పోలీసు బలగాలతో కలిపి మొత్తం 600 మంది పోలీసులను బందోబస్తు విధుల్లో నియమించినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో 01 అదనపు ఎస్పీ, 07 డీఎస్పీలు, 19 సీఐలు, 52 ఎస్సైలు, 71 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సుమారు 400 మంది కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, హోం గార్డులు





పాల్గొంటున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను మొత్తం 11 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ లను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు తెలిపారు. భద్రతా విధుల్లో ఉన్న అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు.

హెలిప్యాడ్ నుండి కాన్వాయ్ మార్గం ద్వారా మక్తల్ మండలం కాట్రేవుపల్లి శివారులోని లిఫ్ట్ స్టేజ్–1 వరకు రోడ్ ఓపెనింగ్ పార్టీలు, ఆర్ ఓ ఎఫ్ బృందాలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్ సిబ్బంది, రూఫ్‌టాప్ సెంట్రీలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు, పార్కింగ్ నిర్వహణ సిబ్బందిని మోహరించినట్లు ఎస్పీ తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని విధుల్లో ఉన్న సిబ్బందికి సూచించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి తాగునీరు, భోజన వసతులు, బయటి జిల్లాల నుండి వచ్చిన పోలీసు సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, ప్రతి పోలీసు అధికారి మరియు సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి అప్రమత్తతతో నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, భద్రతా లోపాలు తలెత్తకుండా రూట్ మానిటరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి.రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు ఎన్. లింగయ్య, నాగేష్, ప్రసాద్,శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ సీఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని పిలుపు

దేవరకద్ర, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవి, వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ





ఇంచార్జి మెట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీలో గ్రూపులు, వర్గాలు లేవని, అందరూ కే. చంద్రశేఖర్ రావు టీమ్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను ప్రతి కార్యకర్త కచ్చితంగా పాటించాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఇంచార్జిలతో సమన్వయం చేసుకుంటూ మండల స్థాయి టీంలు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ అని పేర్కొన్న ఆయన, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి ఐకమత్యంతో కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్న ఆయన, పదేళ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓటు చేశారని, కానీ రెండున్నర ఏళ్లలోనే అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు.

## పంట అవశేషాలను దహనం చేయొద్దు

**రైతులకు వ్యవసాయ అధికారి అనురాధ సూచన**



**హసన్‌పర్తి, జూన్ 3(ప్రజాజ్యోతి) :** పంట కోత అనంతరం పొలాల్లో మిగిలి పోయే పంట అవశేషాలను, ముఖ్యంగా వరి కొయ్యలను దహనం చేయవద్దని హసన్‌పర్తి మండల వ్యవసాయ అధికారి అనురాధ రైతులకు సూచించారు. మంగళవారం వంగపహాడ్‌లో రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట అవశేషాలను దహనం చేయడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు భూమి సారం తగ్గిపోతుందని తెలిపారు. దహనం కారణంగా నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి విలువైన పోషకాలు నశించడమే కాకుండా, నేలలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు కూడా అంతరించిపోతాయని వివరించారు.అవశేషాల దహనం వల్ల వెలువడే పొగ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి శ్వాసకోశ సంబంధిత సమస్యలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అదుపు తప్పిన మంటలు పంటలు, ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను దహనం చేయకుండా నేలలో కలిపే పద్ధతులు, కప్పిపెట్టే విధానాలు, జీవ పదార్థాల ద్వారా కుళ్లబెట్టే మార్గాలను అనుసరించాలని సూచించారు. పంట అవశేషాలు వ్యర్థం కాదని, భూమికి విలువైన సంపదగా భావించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, సాయి, వంగపహాడ్ వ్యవసాయ సమన్వయకర్త పరమేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు సమన్వయంతో కృషి చేయాలి

**– సర్--2026పై అధికారులు, బీఎల్ఏలకు అవగాహన సమావేశం**



**పరకాల, జూన్ 03, (ప్రజాజ్యోతి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)--2026 కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ డివిజన్ అధికారి డీఎస్ వెంకన్న సూచించారు. బుధవారం పరకాల పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్లో 104--పరకాల శాసనసభ నియోజకవర్గం పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్వైజర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పరకాల తహసీల్దార్ టి. విజయలక్ష్మి, దామెర తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, నడికూడ తహసీల్దార్ రాణి, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో సర్--2026 కార్యక్రమం అమలు విధానం, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల అంశాలపై వివరించారు. అలాగే బీఎల్ఏల విధులు, బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియలో వారి పాత్ర, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన సమన్వయ చర్యలపై అవగాహన కల్పించారు. 104--పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు అధిక సంఖ్యలో హాజరై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అధికారులు సూచించారు.

## ఆసరా, చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ ప్రారంభం

**మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్**



**నర్సంపేట జూన్ 3 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 24,25వ వార్డులోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న ఆసరా చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ బత్తిని రాజేందర్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ బోగస్ పెన్షన్ల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, మరణించిన వారి పేర్లను తొలగించడానికి ఈ ప్రక్రియకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులుతమ ఆధార్ కార్డు,పెన్షన్ కార్డులతో సంబంధిత శిబిరాలకు హాజరు కావాలని జూన్ 15 లోగా లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనర్హులను తొలగించడం ద్వారా..కొత్త పారదర్శకత తీసుకురావడం జరుగుతుందని తద్వారా అర్హులైన కొత్త వారికి పెన్షన్లు మంజూరు చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్,వార్డు ఆఫీసర్ సుష్మ, మున్సిపల్ అధికారులు,ఆసరా పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల ఫుడ్ ఫెస్టివల్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 03, (ప్రజా జ్యోతి) :** టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టిటీసీ) కోర్స్–2026లో భాగంగా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. రూమ్ నంబర్–2 విద్యార్థినులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏసీజీ మధుసూదన్‌రావు, కోర్స్ ఇన్‌చార్జ్ విజయ్‌మోహన్, కోర్స్ డైరెక్టర్ నయీమ్ పాషా అతిథులుగా హాజరయ్యారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన పలు రకాల వంటకాలను ప్రదర్శించి అతిథులకు వడ్డించారు. పోషక విలువలు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండేలా వంటకాలను రూపొందించడం విశేషంగా నిలిచింది. విద్యార్థినుల సృజనాత్మకత, నైపుణ్యం, అంకితభావం, జట్టుగా పనిచేసే తత్వం ఈ కార్యక్రమంలో ప్రతిఫలించాయని అతిథులు ప్రశంసించారు. స్వయంగా ఆహార పదార్థాలను తయారు చేసి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థినులను అభినందించిన అతిథులు భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, ట్రైనింగ్ ఉపాధ్యాయురాలు సుమలతతో పాటు విద్యార్థినులు కవిత, ప్రవళిక, సృజన, అనిత, జ్యోతిలక్ష్మి, కళ్యాణి, సౌజన్య, శోభ, జిలేఖ, మానస, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో గ్రామసభ

**ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల నమోదు లక్ష్యం**



**ఎల్కతుర్తి జూన్ 3 (ప్రజాజ్యోతి) :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి వయస్సు కలిగిన ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంతో ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ లావుడ్య మనోహర్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు, సౌకర్యాల గురించి వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ విద్యతో పాటు ఆధునిక బోధన అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని బడి వయస్సు పిల్లలందరినీ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీ బత్తిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారికి విద్య అందేలా ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. ఈ గ్రామసభలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు,గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరయ్య చారి, ఉపాధ్యాయులు శ్రీధర్, అనిత, ముకుంద్ రెడ్డి, సుధాకర్, మోహన్ రావు, సునీత, తదితరులు హాజరయ్యారు. గ్రామంలోని బడి వయస్సు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి 100 శాతం నమోదు సాధించేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు

**మడికొండలో జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన**







**హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్ 03, (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా మడికొండ మహిళా ప్రాంగణంలో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలిసి శంకుస్థాపన చేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన సమాజాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా వివిధ రంగాల్లో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహిళలు, పెట్రోల్ బంక్ నిర్వహణలోనూ ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ప్రభుత్వం మహిళలను లబ్ధిదారులుగానే కాకుండా యజమానులుగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, మహిళలను స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు తీసుకెళ్లేలా ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆదాయ వనరుల విస్తరణకు ఈ పెట్రోల్ బంక్ దోహదపడుతుందని, మహిళల ఆర్థికాభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఐనవోలు ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యకలాపాలకు సంబంధించి మహిళా సభ్యులకు ఆర్థిక సహాయ చెక్కులను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంయుక్తంగా అందజేశారు. మహిళలు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మరింత ముందుకు సాగి ఆర్థికంగా బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, బీపీసీఎల్ ఎండి సుధీర్, ఐకేపీ రీజినల్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐకేపీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పక్కా యాక్షన్ ప్లాన్‌తో గ్రామ, వార్డ్ సభలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, జూన్ 03 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నుండి నిర్వహించనున్న గ్రామ, వార్డ్ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగం గా నేటి నుండి నిర్వహించే గ్రామ, వార్డ్ సభల ఏర్పాట్ల మీద అలాగె అవగాహన కల్పించాలిసిన అంశాల మీద వివిధ శాఖల జిల్లా మండల, గ్రామ స్థాయి అధికారులు,మండల స్పెషల్ అధికారులు, గ్రామ సభ ల స్పెషల్ అధికారుల కి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు, వార్డు సభలను నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ, వార్డు సభలను పక్కాగా నిర్వహించి వివిధ అంశాల మీద ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పంటల మార్పిడి, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల పైన ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గురించి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యం, ఎన్నికల సిబ్బంది విధులు, పౌరుల భాగస్వామ్యం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన పెంచడం ద్వారా ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి సహకరించాలని అధికారులు కృషి చేయాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణలో ఉన్న నిబంధనలను, గృహాల బాధ్యత, భారీ వ్యర్థాల ఉత్పత్తి నిబంధనలు, స్థానిక సంస్థల పాత్ర, విస్తృత బాధ్యత,ల్యాండ్ ఫిల్స్ భవిష్యత్ తదితర అంశాల మీద సభల్లో ప్రజలకి అవగాహన కల్పించాలన్నారు. రానున్న వర్ష కాల నేపథ్యంలో గ్రామీణ , పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సీజనల్ వ్యాధుల నివారణ కోసం డ్రైనేజి ల నిర్వహణ, వాటర్ ట్యాంక్ లను క్లీన్ గా పెట్టడం, దోమల నివారణకు డ్రై డే నిర్వహించడం, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం, శానిటేషన్ నిర్వహణ, వేడి నీరు తాగడం ఆవశ్యకత గురించి దండోరా వేయడం తదితర అంశాల మీద సభల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల మార్పిడికి సంబందించి పప్పు దినుసులు, నూనె పంటల అవశ్యకత ను, జాతీయ ఎరువుల చట్టం, సాయిల్ ప్రిపరేషన్ కి అలాగే పంటల కోసం ఎరువులను ఎలా వాడాలన్నా అంశాల మీద తెలియజేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగం గా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎవెన్యూ, కమ్యూనిటీ ప్లాంట్ ఏర్పాటు ప్రాధాన్యత, ఇరిగేషన్ శాఖ అధికారులు వర్షాకాలంలో వరదలు సంభవిస్తే ప్రజలు పాటించాలిసిన నియమాలను, జాగ్రత్త లని తెలియజేయాలన్నారు. గ్రామ, వార్డు సభలలో ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేయాలన్నారు. సభల నిర్వహణకు నిర్ణీత షెడ్యూల్ తయారు చేసి, తదనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షా లోం, జడ్పీ సీఈఓ రంగారావు, ఆర్డీఓలు గోపిరామ్, కిరణ్ ప్రకాష్,ఏసీపీ భీమ్ శర్మ వివిద శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు,మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటవెంటనే గోదాములు, మిల్లులకు తరలించాలి

**– అదనపు వాహనాలని ఏర్పాటు చేయండి – రవాణా ప్రక్రియ వేగవంతం కావాలి**

**– ఎక్కువ ధాన్యం నిల్వ లు ఉన్న కేంద్రాల మీద ప్రత్యేక దృష్టి – జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, జూన్ 03 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ తుది దశకి చేరుకున్న నేపథ్యంలో అధికారులు మరింత పర్యవేక్షణ చేస్తే త్వరగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం మిల్లకు రవాణా అవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట అదనపు వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచి కొనుగోళ్లు, రవాణా ను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు 29187 రైతుల వద్ద నుంచి 1,82,235 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 1,76,004 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించడం జరిగిందని, 27181 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 337 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 1,46,263 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని, మొత్తం 572 మంది హమాలీలు ఉన్నారన్నారు. కొనుగోలు, రవాణా చేయాలిసిన అంశం మీద సంబందిత మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అని కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్, అన్లోడింగ్, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి ఆలస్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 234 లారీలు, 66 డీసీఎంలు, 307 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇంకా ఎక్కువ ధాన్యం ఉన్న కేంద్రాల మీద ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు వాహనాలను పంపించి త్వరగా మిల్ లకు తరలించాలన్నారు. రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి, తిరిగి కొనుగోలు కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగింపు దశకు చేరుకున్నందున, రవాణా ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షించి, ధాన్యం తరలింపులో ఎటువంటి అంతరాయం లేకుండా మిల్లులకు, గోదాములకు పంపించాలని సూచించారు. మిల్లులకు వచ్చే ధాన్యాన్ని మరింత మంది హమాలీలను పెట్టుకొని, త్వరగా దిగుమతి అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కువ ధాన్యం ఉన్న కేంద్రాలను తహసీల్దార్ లు సందర్శించి వెంటనే రవాణా ప్రక్రియ త్వరగా కావాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ లు ఆయా కేంద్రాలను పర్యవేక్షణ చేస్తూ.. కావాలిసిన వాహనాలను, హమాలీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో భాస్కర్, డీఎంఓ రామకృష్ణ, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శిల్ప, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు



**హసన్‌పర్తి, జూన్ 3(ప్రజాజ్యోతి) :** రాష్ట్ర మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలను హసన్‌పర్తి మండలం భీమారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారంలోని వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.హరీష్‌రావు వీరాభిమాని, జిల్లా యువ నాయకుడు బేతెల్లి వినయ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులుగా సంగాల విక్టరీబాబు, అటికం రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధుల సమక్షంలో జన్మదిన కేకును కోసి, వారికి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకపు శ్రీనివాస్, బూర రామకృష్ణ, ఉప్పు ప్రభాకర్, చింతల అనిల్ యాదవ్, పల్లపు రవికుమార్, మంద సార్థిక్, ప్రశాంత్, బూర రోషన్, పోతరబోయిన విజయ్, నిఖిల్, మున్నా, ఓంకార్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**– ఎంపీడీవో ఆధ్వర్యంలో బడిబాట**



**ఖానాపురం జూన్ 3(ప్రజాజ్యోతి) :** ఖానాపురం మండలం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీడీవో వనపర్తి అద్వైత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారితో ప్రతిజ్ఞ చేయించి, ప్రభుత్వ పాఠశాల ప్రవేశ పత్రాలను అందించారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యయుల ద్వారా మాత్రమే అందుతుందని తెలిపారు. కొత్తూరు పాఠశాల పదవ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పెన్షన్లు, ఉపాధి హామీ వేతనాలు, మొదలగు సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తి మేర కృషి చేస్తానన్నారు. అనంతరం డంపింగ్ యార్డ్ సందర్శించి నిర్వహణ తీరుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీల్, సర్పంచ్ జాటోత్ వినోద్, హై స్కూల్ హెడ్మాస్టర్ శిరీష, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ మోతిలాల్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**హసన్‌పర్తి, జూన్ 3(ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి పాత మార్కెట్ సమీపంలో శ్రీ శరణ్య ఆసుపత్రి ఆధ్వర్యంలో మూత్రపిండాల వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వరంగల్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన శ్రీ శరణ్య ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఈ శిబిరంలో ప్రముఖ మూత్రవ్యాధుల నిపుణుడు డాక్టర్ బి.వి. రెడ్డి, ఎర్రగట్టు గుట్ట దేవస్థానం మాజీ అధ్యక్షుడు ఆరెల్లి వెంకటస్వామి, ధర్మకర్త గరిగ రాజు, జన్ను అశోక్, మేకల రవీందర్, వైద్య నిపుణుడు పూర్ణ గోగుర్ల రాకేష్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కే.సాంబశివరావు




**మహాముత్తారం జూన్ 3 ప్రజాజ్యోతి :** మహాముత్తారం మండల నూతన విద్యాశాఖ అధికారిగా ములుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సాంబ శివరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామాలలో బడిబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మండలాన్ని విద్యారంగంలో ముందు స్థానంలో ఉంచుతానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

## 50 శాతం సబ్సిడీతో జీలుగు విత్తనాల పంపిణీ

మునగాల, జూన్ 03 (ప్రజా జ్యోతి): మునగాల మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. మునగాల సహకార సంఘం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమి సారాన్ని పెంపొందించడంతో పాటు



సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రైతులకు జీలుగు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు జీలుగు పంట సాగు విధానాలు, పచ్చిరొట్ట ఎరువు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, మునగాల గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల వెంకట్, సహకార సంఘం సెక్రటరీ బసవయ్య, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సేంద్రియ పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చాలని అధికారులు సూచించారు.

## ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలే ముద్దు "వాల్ పోస్టర్ల ఆవిష్కరణ"

భూదాన్ పోచంపల్లి, జూన్ 03 (ప్రజాజ్యోతి): మున్సిపాలిటీలోని ముక్తాపూర్ గ్రామంలో స్థానిక కౌన్సిలర్లు శ్రీరామ్ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి ఆధ్వర్యంలో "ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ



పాఠశాలే ముద్దు" అనే సందేశంతో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచంద్రం గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ సిద్ధగోని రాజమల్లేశ్, దేవస్థానం చైర్మన్ కుక్కలి జగన్, గుండ్ల రమేష్, కొండమడుగు మైసయ్య, మల్లయ్య, ఇట్టామోని నరేందర్, రుద్ర భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కు సన్మానం

మోత్కూరు, జూన్ 3 (ప్రజా జ్యోతి): మోత్కూర్ మున్సిపల్ కమిషనర్ గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌలుకొండ నర్సయ్య ను బుధవారం బిఆర్ఎస్ నాయకులు మర్యాద



పూర్వకంగా కలిసి శాలువాతో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి , బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షులు కొండ సోంమల్లు, కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, రాంపాక నాగయ్య, జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, మలిపెద్ది మల్లారెడ్డి, కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి, చేతరాశి వెంకన్న , పోన్నెబోయిన మచ్చగిరి, దాసరి ఎలందర్ తదితరులు పాల్గొన్నారు.


## హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదానం

మోత్కూరు, జూన్ 3 (ప్రజా జ్యోతి): మాజీ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ జిల్లా నాయకులు, బుజిలాపురం గ్రామ ఆర్ఎంపి డాక్టర్ కోక భిక్షం బుధవారం పేదలకు అన్నదానం చేశారు. నార్కట్పల్లి మండలం చెరువుగట్టు దేవాలయం ఆవరణలో వంద మంది నిరుపేదలకు ఆయన అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరీష్ రావు 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోకా బీఆర్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోక రేణుక, మురళి, ప్రవీణ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఒకప్పుడు విద్యార్థులు పాఠశాల కోసం... ఇప్పుడు పాఠశాలలే విద్యార్థుల కోసం

మునగాల, జూన్ 3 (ప్రజాజ్యోతి): మునగాల మండలంలో అడ్మిషన్ల కోసం




ప్రైవేటు పాఠశాలల ప్రచార హోరు మునగాల మండలంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేటు పాఠశాలల మధ్య అడ్మిషన్ల పోటీ తీవ్రంగా మారింది. ఒకప్పుడు మంచి పాఠశాలలో తమ పిల్లలకు సీటు దక్కాలని తల్లిదండ్రులు పాఠశాలల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడం, ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం వంటి కారణాలతో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలకు చెందిన వాహనాలు, ప్రచార రథాలు తిరుగుతూ తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. మైకుల ద్వారా పాఠశాల ప్రత్యేకతలు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, సౌకర్యాల గురించి ప్రచారం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుస్తూ తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతున్నాయి. ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రత్యేక కోచింగ్, ఒలింపియాడ్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా సదుపాయం వంటి అంశాలను ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. కొంతమంది యాజమాన్యాలు ఫీజుల్లో రాయితీలు, తోబుట్టువులకు ప్రత్యేక తగ్గింపులు, ప్రారంభ అడ్మిషన్లకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మునగాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం ఈ ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. విద్యార్థుల కోసం పాఠశాలల మధ్య నెలకొన్న పోటీ కారణంగా ప్రతి విద్యాసంస్థ తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఒకే గ్రామంలో రెండు మూడు ప్రైవేటు పాఠశాలలు ప్రచారం నిర్వహించడం వల్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్య విషయంలో వివిధ అవకాశాలను పరిశీలించే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల సంఖ్యకు మించి పాఠశాలలు పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమాల ద్వారా మౌలిక వసతులు మెరుగుపడడం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండటం కూడా ప్రైవేటు పాఠశాలలపై ప్రభావం చూపుతున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీంతో విద్యార్థుల చేరికల కోసం యాజమాన్యాలు మరింత శ్రద్ధ చూపాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్తుల అభిప్రాయం ప్రకారం, ఒకప్పుడు మంచి పాఠశాలలో అడ్మిషన్ కోసం తల్లిదండ్రులు క్యూల్లో నిలబడే రోజులు ఉండేవి. కానీ ఇప్పుడు అదే పాఠశాలలు గ్రామ వీధుల్లో తిరుగుతూ విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రచారం చేయడం విద్యారంగంలో వచ్చిన మార్పులకు నిదర్శనంగా నిలుస్తోంది. "ఒకప్పుడు పాఠశాలల కోసం విద్యార్థులు వెతికేవారు... నేడు విద్యార్థుల కోసం పాఠశాలలే గ్రామాల బాట పడుతున్నాయి" అనే వ్యాఖ్య మునగాల మండలంలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితులకు అద్దం పడుతోంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచిత ప్రవేశం


మోత్కూరు, జూన్ 3 (ప్రజా జ్యోతి): మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే ప్రతి విద్యార్థికి ఉచిత ప్రవేశం తో పాటు రూ.1500 విలువ చేసే పాఠ్య



పుస్తకాలు అందించడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టి సారించి అనుభవం, నైపుణ్యం కలిగిన అధ్యాపకులచే విద్యా బోధనతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగంగా అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. బాలుర కోసం వసతి గృహ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను పూర్తి చేసిన వారికి పై చదువుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రాయితీ, మొదలైన సౌకర్యాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థుల భవిష్యత్తుకు చక్కటి బాటలు వేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ బి. ఉప్పలయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. నర్సింహారెడ్డి, లెక్చరర్లు ఎం. పరుశురాములు, సి.హెచ్. లింగస్వామి, ఏ.హరికృష్ణ, వై. నర్సిరెడ్డి, కే.శ్యామ్, బి. పురుషోత్తం రెడ్డి, డి.మంజుల, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాళిక ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు, జూన్ 3 (ప్రజా జ్యోతి): ప్రజా పాలన మొదలై రెండున్నర సంవత్సరాలు గడిచినా మండల పరిధిలోని దీర్ఘకాళిక ప్రజా




సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు విమర్శించారు. బుధవారం ఆయన మోత్కూర్ లో పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులతో కలసి పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ మూడు మండలాలకు సాగు, త్రాగు నీరు అందించే బునాదిగాని కాల్వ పనులు పూర్తి చెయ్యాలని దశాబ్ద కాలంగా అనేక ఉద్యమాలు నిర్వహించిన ఫలితంగా నిధులు కేటాయించినట్లు ప్రకటన చేసిన ప్రభుత్వం ఇప్పటికి పనులు పూర్తి చేయలేదని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 30 పడకల ఆసుపత్రి, బస్సు డిపో, గుండాల -మోత్కూర్ మధ్య బిక్కేరు వాగుపై బిడ్జి, రెవిన్యూ డివిజన్ లాంటి అనేక సమస్యలపై, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చుస్తున్నారని అన్నారు. కాని రెండున్నరేండ్లు గడచినా పనుల్లో ఎలాంటి పురోగతి లేదని అన్నారు. మోత్కూర్ లోని పనకబండ రోడ్డు నుండి రాజన్నగూడెం వరకు రోడ్డు నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకున్న పరిస్థితి లేదని, మోత్కూర్ మినీ ట్యాంక్ బండ్ గత వర్షా కాలంలో కుంగి రాక పోకలకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు వర్షాకాలం ప్రారంభం కావస్తున్న ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, పానుగుల రమేష్ పాల్గొన్నారు.

## చిరుధాన్యాలు, పప్పు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

### మండల వ్యవసాయ అధికారి బండారు శివ వెల్లడి

నాంపల్లి,జూన్,03(ప్రజా జ్యోతి): ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఈ వానాకాలంలో వర్షపాతం సాధారణ స్థాయిలో ఉండకపోవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి బండారు శివ సూచించారు.



తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు చిరుధాన్యాలు (జొన్న, సజ్జ, రాగి), పప్పుధాన్యాలు (కంది, పెసర, మినుము) మరియు నూనెగింజల పంటలు (వేరుశెనగ, నువ్వులు, ఆముదం) సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితో సాగవడమే కాకుండా ఎండ పరిస్థితులను కొంతవరకు తట్టుకుని రైతులకు ఆదాయ భద్రత కల్పిస్తాయని తెలిపారు. అలాగే రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకొని, నేలలో తేమను నిల్వ ఉంచే యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. వర్షాలపై పూర్తిగా ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

## కోదాడలో రాయితీపై జీలుగు విత్తనాల పంపిణీ ప్రారంభం

### సబ్సిడీ జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి
### కోదాడ పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి

కోదాడ టౌన్,జూన్ 3(ప్రజా జ్యోతి): కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం



రైతులకు రాయితీపై జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి రైతులకు విత్తన బస్తాలను అందజేసి మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగు విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. 30 కేజీల బస్తాకు రాయితీ పోగా రైతులు తమ వాటా కింద రూ. 2452 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. విత్తనాలు కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులను వ్యవసాయ అధికారులతో ధ్రువీకరించుకొని తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సబ్సిడీ విత్తనాలను రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతులు తొందరపడకుండా, వర్షాలు పడ్డాక భూమిలో సరైన పదును (తేమ) చూసుకుని జీలుగు విత్తనాలు చల్లుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఈఓ లు పిచ్చయ్య, నగేష్, పిఎసిఎస్ సీఈఓ మంద వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని ధర్నా

మోత్కూరు, జూన్ 3 (ప్రజా జ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో ఎన్‌హెచ్-930పీ జాతీయ రహదారిపై రైతులు, అఖిలపక్షాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సుమారు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షాల నాయకులు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన వడ్లు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే లారీలను అందుబాటులో ఉంచి ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే సంబంధిత అధికారులు మొండి వైఖరిని వీడి, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆలస్యం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, అకాల వర్షాల వల్ల ధాన్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ పి జ్యోతి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు గుదె మధుసూదన్ యాదవ్, గుంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# కారేగాం గ్రామంలో బడిబాట కార్యక్రమం

**నిజామాబాదు ప్రజాజ్యోతి జూన్ 03:**
చందూర్ మండలంలోని కారేగాం గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారిని పాఠశాలలో





చేర్పించి విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సాయిలు, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, సర్పంచ్ డా. లాల్ సింగ్, గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాశాఖ అధికారికి ఘన సన్మానం

**రుద్రూర్, జూన్ 3 (ప్రజా జ్యోతి):**
రుద్రూర్ మండల విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లయన్ రామ్ సింగ్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా శాలువా కప్పి,పూలమాలలు వేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.వి. మోహన్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి మండల విద్యాశాఖ అధికారి రామ్ సింగ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రామ్ సింగ్ మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ శ్యామ్ సుందర్ పహాడే, పత్తి రాము, ప్రశాంత్ గౌడ్, సాగర్, గంగాధర్, మధు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్లూరు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం

**కామారెడ్డి రూరల్, జూన్ 3 (ప్రజాజ్యోతి):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడం, విద్యపై అవగాహన కల్పించడం లక్ష్యంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం కామారెడ్డి మండలంలోని అడ్లూరు గ్రామంలో గ్రామ సభతో పాటు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రాజు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో





నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన బడిబాట ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొని విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల నమోదు, విద్యా ప్రమాణాల పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 551 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆర్. లాస్యను డీఈఓ రాజు, స్థానిక కౌన్సిలర్ మహేష్ తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతం అడ్మిషన్లు పెరిగేలా కార్యాచరణ రూపొందించి



అందరూ కృషి చేయాలని డీఈఓ రాజు సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి పాఠశాల వయస్సు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మహేష్, ఎంఈఓ, కోఆర్డినేటర్లు, సీఆర్పీ రాములు, ఏఏపీసీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

– గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం
– నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులకు సూచన

**సదాశివనగర్, మే 03 (ప్రజాజ్యోతి)**
సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారురాలు పిల్లి సాయవ్వతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో పూరి గుడిసెలో నివసిస్తూ వర్షాలకు తన ఇల్లు కోల్పోయానని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ద్వారా సురక్షితమైన నివాసం కలగబోతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి కుటుంబానికి సురక్షితమైన గృహం అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికిఇళ్లు మంజూరు చేయాలని, ఎక్కడా కూడా పూరి గుడిసెలు కనిపించకూడదని, అధికారులు ప్రతీ గ్రామాన్ని పర్యటించి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ పేద కుటుంబాల ఆర్థిక





సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో రూ.1.59 కోట్లు 45 లక్షల బ్యాంకు రుణాలను 90 మంది లబ్ధిదారులకు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలను చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో సత్యనారాయణ, ఎంపీడీవో సతీష్ కుమార్. సర్పంచ్ గంగాధర్. ఉప సర్పంచ్ పాలకవర్గం సభ్యులు పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బడి బాట షెడ్యూల్‌లో భాగంగా బాల్కొండ ఉన్నత పాఠశాలలో గ్రామసభ

**ప్రజా జ్యోతి, బాల్కొండ జూన్ 3**
బడి బాటలో భాగంగా ఈరోజు తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ ప్రకారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట విద్యార్థుల నమోదు కార్యక్రమంపై చర్చించడానికి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. గ్రామంలోని పాఠశాల వయస్సు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి ప్రతిజ్ఞ చేయడం.ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం అనేది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి, విద్య యొక్క ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రత్యేక డ్రైవ్. చేపట్టిందని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ అన్నారు.గ్రామంలోని బడి ఈడు గల ప్రతి చిన్నారిని, డ్రాప్-అవుట్‌లను మరియు అంగన్‌వాడీల్లో 5 ఏళ్లు నిండిన పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు, అంగన్వాడీ టీచర్లకు,ఐకెపి మహిళా సమాఖ్యలకు అవగాహన కల్పించడం నాణ్యమైన విద్యతోపాటు, అధునాతన సాంకేతిక పద్ధతుల పద్ధతుల ద్వారా బోధన, అనుభవం గల, అత్యున్నత అర్హతలు గల ఉపాధ్యాయ బృందం, అన్ని అంగులతో కూడినటువంటి



మౌలిక సదుపాయాలు, ఏ ఆర్ వి ఆర్ ద్వారా బోధన, రోబోటిక్స్ పై శిక్షణ, ఎక్స్పోజర్ విజిట్, వృత్తి విద్య కోర్సులు, వీటితోపాటు ఐఐటి మద్రాస్ సమన్వయంతో సర్టిఫికెట్ కోర్సు ఇంటెన్షిప్,పాఠ్య బోధానతో పాటు జీవిత పాఠాలను బోధించడం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్‌లు, యూనిఫాంలు,రాగిజావ మరియు అల్పాహారం మధ్యాహ్న భోజన పథకాలపై ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుందని తల్లిదండ్రులు దీనిపై ఆలోచించాలన్నారు.పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు, మహిళా సంఘాలు మరియు గ్రామ పెద్దల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని మండల విద్యాశాఖ అధికారి అన్నారు.గ్రామసభలో రచించిన విషయాలు గ్రామంలోని ఇంటింటి సర్వే ద్వారా బడికి వెళ్లని పిల్లలను గుర్తించడం.నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి రోజువారీ కార్యక్రమాల ప్రణాళికను రూపొందించడం.వలస కుటుంబాల పిల్లల విద్య కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం."ప్రతి చిన్నారి బడిలోకి" అనే నినాదంతో ర్యాలీలు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడం ఈ గ్రామ సభ యొక్క ప్రధానోద్దేశం. ఈ బడిబాట కార్యక్రమం ద్వారా గ్రామంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100% ప్రవేశాలు జరిగేలా చూడటం గ్రామసభ ముఖ్య లక్ష్యం. ముఖ్య విషయాలు మండల కేంద్రంలోని పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, మహిళా సమాఖ్య గ్రూపులు, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు,ప్రభుత్వ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు తదితరులు ఈ సమావేశానికి హాజరు కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగారాం,పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పిల్ల దొరకదు.. పెళ్లి కాదు!



- వయసు మీద పడుతున్నా పెళ్లి కాని ప్రసాదులు ఎందరో..
- "బాబ్బాబు మా అబ్బాయికి సంబంధం చూసిపెట్టండి" అంటూ తల్లిదండ్రుల వేడుకోలు
- కొన్ని చోట్ల ఎదురు కట్నం ఇచ్చినా పెళ్లిళ్లు కుదరని పరిస్థితి
- పెళ్లెప్పుడు చేసుకుంటావ్? అనే ప్రశ్నలతో యువకులపై మానసిక ఒత్తిడి
- పిల్ల దొరికినా సవాలక్ష కండీషన్లు... ప్రభుత్వ ఉద్యోగం ఉంటేనే ఓకే అంటున్న పిల్లనిచ్చేకుటుంబాలు
- ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్ ముగుస్తుశీడడంతో ఈ ఏడు కాకున్నా వచ్చేఏడన్న మంచి సంబంధం దొరికేనా...!లిపెళ్ళికానీ అబ్బాయిలు ఎదురుచూపు?
- కులాలను వేధిస్తున్న ఆడపిల్లల కొరత
- సమాజంలో మారుతున్న వివాహ ధోరణులపై ఆందోళన
- ప్రత్యేక కథనం

**ప్రజా జ్యోతి, ఏర్గట్ల, జూన్3;**
,ఒకప్పుడు అమ్మాయిల పెళ్లిళ్ల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చదువుకున్న, ఉద్యోగాలు చేస్తున్న యువకులు కూడా పెళ్లి సంబంధాలు కుదరక ఇబ్బందులు పడుతున్నారు. వయసు 30, 35 దాటినా పెళ్లి కాని యువకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ "మా అబ్బాయికి మంచి సంబంధం ఉంటే చెప్పండి" అంటూ తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులు, మధ్యవర్తుల చుట్టూ తిరుగుతున్న దృశ్యాలు సాధారణంగా కనిపిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు ఎదురు కట్నం ఇవ్వడానికి కూడా సిద్ధపడుతున్నా, ఆశించిన సంబంధాలు కుదరడం లేదని వాపోతున్నారు.ఇక పెళ్లి సంబంధాల విషయంలో అమ్మాయిల కుటుంబాలు అనేక షరతులు విధిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం ఉండాలి, సొంత ఇల్లు ఉండాలి, మంచి జీతం ఉండాలి, నగరంలో స్థిరపడాలి వంటి నిబంధనలు ముందుకు వస్తున్నాయి. ఫలితంగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న లేదా వ్యవసాయంపై ఆధారపడిన యువకులు వెనుకబడుతున్నారు. మరోవైపు "పెళ్లెప్పుడు చేసుకుంటావ్?" అనే ప్రశ్న యువకులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అడిగే ప్రశ్నలు కొందరిలో ఆత్మన్యూనతాభావాన్ని పెంచుతున్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు.సామాజిక మార్పులు, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం వలసలు, పెరిగిన అంచనాలు, తగ్గుతున్న జననాల రేటు వంటి అనేక కారణాలు ఈ పరిస్థితికి దారితీస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వివాహం అనేది కేవలం ఆర్థిక స్థితి లేదా ఉద్యోగంతో కాకుండా వ్యక్తిత్వం, పరస్పర అవగాహన, కుటుంబ విలువల ఆధారంగా జరగాలని పెద్దలు సూచిస్తున్నారు. "పెళ్లి వయసు దాటిపోతున్నా... పిల్ల దొరకడం లేదు. ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సమాజం ఆలోచించాల్సిన అంశంగా మారింది" అని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడు కాకున్నా మల్ల వచ్చే ఏడాదైనా మంచి సంబంధం దొరకకపోతుందా అని ఆశవాహులు ఎదురుచూస్తూ కాలం గడిపేస్తున్నారు.

# ఈ నెల 5 న శ్రీ నిమిషంభ ఆలయంలో పూజలు అన్నదానం

**ప్రజా జ్యోతి, బాల్కొండ జూన్ 3**
నిజామాబాదు జిల్లా బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని 524 సంవత్సరాల నుండి కొలువై ఉన్న శ్రీ నిమిషంభ ఆలయంలో ఉదయం అమ్మ వారికి అభిషేకం,పూజల జరుగనున్నాయని ఆలయ పూజారి బి. కృష్ణ రావు జోషి తెలిపారు."అలకొండ పురి రమ్య నగై: నవబి రావృతా !తత్రేషా తు మహాదేవి నిమిషాంబా ప్రతిష్ఠితా!! (తొమ్మిది ఏతైనా నల్ల రాల్ల కొండల చేత చుట్టబడి ఉన్న అందమైన అల్లకుండ, వల్లకొండ, ఏబాల్కొండ అనే గ్రామంలో మహా శక్తి అయిన శ్రీ నిమిషంబ దేవత పూర్వమునుండే కుల గురువైన కీ,, శే,,వారసుల నుండే నిత్య నైవేద్యం పూజలు అందుకుంటుంది.) ఈ ఆలయంలో ప్రతి నెల మొదటి శుక్రవారం అన్నదానంలో భాగంగా జూన్ నెల మొదటి శుక్రవారం టోకెన్ నెం (77) తేదీ 05- 06 2026 నిజామాబాదు జిల్లా భీంగల్ కు చెందిన బ్రహ్మ రౌతు సుజాత, రాధాకిషన్ కుమారుడు బి.తరుణ్ కుమార్ వర్మ, ఆర్మూర్ కు చెందిన నాంపల్లి మౌనిక, విజయ్ కుమార్ దత్త పుత్రిక వాణి తో శ్రీ నిమిషంబ దేవి ఆలయంలో మొట్ట మొదటి వివాహం తేదీ 30 -04-2026 తేదీ వైశాఖ శుద్ధ చతుర్దశి గురువారం వివాహం జరిగిన నందుకు ఆలయంలో అన్నదానం చేస్తున్నారు.

**అన్న దానానికి ఖాళీలు**
2026, జూలై నుండి 2026 డిసెంబర్ వరకు ప్రతి నెల మొదటి శుక్రవారాల్లో అన్నదానం చేయాలనుకు నే కుటుంబాలు తమ కుటుంబ పేర్లు, గోత్రాలు మరియు కుటుంబ సమూహ ఫోటోలతో 9666759297 నంబర్‌కు ఫోన్ చేసి టోకెన్ నంబర్ పొందాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు. అన్న దానం మహాదానం,నిత్యం చేస్తే పుణ్యఫలం, అన్నం లేనివారికి, దానం చేయడం మానవ ధర్మం ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం నిత్యం దేవుని సేవించడం ఒకటే అని ఆలయ సేవకులు బి. ఆర్. నర్సింగ్ రావుఈ సందర్భంగా భక్తులకు వివరించారు.

**కనపడటం లేదు**
నేడు కలియిగా ప్రభావంతో శక్తి స్వరూపమైన స్త్రీలు హిందూ సంప్రదాయాలతో కనపడటం లేదు,పూర్వం రోజుల్లో మన నారి మణులు నుదుటన గుండ్రటి ఆకారంలో కుంకుమ బొట్టు, కల్లకు కాటిక, తలలో పూలు, అంద మైన వాలు జడ, చేతులకు గాజులు, ఒళ్ళు నిండా చీర, జాకెట్,కాళ్లకు మట్టేలు, ఉండేదని, నేటి స్త్రీలు నుదుటిన కని... కనిపించని చిన్న టికిల్ బొట్టు, పెదవులకు లిఫ్టిక్,తల వెంట్రు కలు విరబూసిన వెంట్రుకలు, ఒళ్ళు కనిపించే విధంగా రెడీ మేడ్ వస్త్రాలను ధరించి ఆలయాల్లోకి వస్తే ఆలయంలోకి ప్రవేశం లేదని తేల్చి చెప్పారు.ఈ రోజు జరిగిన పూజ కార్యక్రమంలో నిజామా బాదు, నిర్మల్, ప్రాంతాల భక్తులు హాజరైనారు.

**ఈ క్షేత్రానికి ఏలా చేరుకోవాలి**
నిజామాబాద్ జిల్లా బాల్కొండలో కొలువై ఉన్న శ్రీ నామిషంభ దేవి హైదరాబాద్ పట్టణానికి 200 కిలోమీటర్ దూరంలో హైదరా బాద్ – నాగపూర్ జాతీయ రహదారి




పై బాల్కొండ ఉంది.అతి సమీ పంలో ఆసియ ఖండం లోనే వెడల్పు అయినా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 8 కి.మీ. దూరంలో కలదు.పవిత్ర శక్తి పీఠాలలో ఉత్తమ మైన శక్త. స్వరూపిణి అయిన శ్రీ నిమిషంబ దేవి అమ్మ వారిని దర్శించుకుని జీవన ముక్తి పోదాలని అసిసద్దామా ....మరి.

## నీరడి భూమయ్య మృతి పట్ల

# మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సంతాపం

కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు

**కామారెడ్డి రూరల్ జూన్ 3 (ప్రజాజ్యోతి):**
~జంపేట మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ, ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నీరడి శంకర్ గారి సోదరుడు నీరడి భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ బుధవారం వారి నివాసానికి వెల్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భూమయ్య చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చిన జాజాల సురేందర్, భూమయ్య మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, పార్టీ తరఫున తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. భూమయ్య గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, అందరి అభిమానాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా గుర్తుండిపోతారని అన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, భూమయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



# ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

**హత్నూర 3 జూన్ (ప్రజా జ్యోతి)**
మండల పరిధిలోని దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తా దగ్గర బుధవారం నాడు మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు బి ఆర్ ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేసి పంచిపెట్టారు. బి ఆర్ ఎస్ నాయకులు కేకు ఒకరికి ఒకరు తినిపించుకుంటూ సాయి బాలాయ్ తీసుకుంటూ జన్మదిన వేడుకలు సంతోషంగా జరుపుకున్నారు. హరీష్ రావు లాంగ్ లీవ్, హరీష్ రావు లాంగ్ లీవ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ టపాకాయలు పేల్చి తమ నాయకుడు మాజీ మంత్రి హరీష్ రావు లాంటి ట్రిబుల్ షూటర్ లీడర్ తెలంగాణలో లేరని నినాదాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకులు శివ శంకర్ రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆషా జ్యోతి, పేదల పెన్నిధి, రాష్ట్ర అభివృద్ధి కృషీవలుడు మాజీ మంత్రి హరీష్ రావు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరారు. ఈకార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, మాజీ ఎంపీ పి వావిలాల నర్సింలు, యువజన నాయకులు తుమ్మలపల్లి కిషోర్, అంబటి అర్జున్, మధు, దౌల్తాబాద్ పట్టణ





అధ్యక్షుడు అజ్జు, సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీ టి సి ఆగమయ్య, శంకర్, రాము, గొల్ల కృష్ణ టిఆర్ఎస్ ఎంపిటిసిలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

– ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నాయకుల ఆకాంక్ష

**అందోల్, (ప్రజా జ్యోతి):**
జోగిపేట పట్టణంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, చాపల వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హరీష్ రావు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ఉద్యమ నాయకుడిగా ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధితో పాటు అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి హరీష్ రావు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా హరీష్ రావు



నిలిచారని తెలిపారు. హరీష్ రావు ఆయురారోగ్యాలతో నిండి, మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. జోగిపేట పట్టణ ప్రజలు, అందోల్ నియోజకవర్గ ప్రజల తరఫున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్ల శంకర్, మహేష్ యాదవ్, శంకర్ రావు, రఫిక్, పెండా గోపాల్, దాసరి దుర్గయ్య, మన్నే పరిపూర్ణం, మొగులయ్య, పల్లె వెంకటరమణ, పోచయ్య, నాసర్ ఖాన్, బరుడి వీరేశం, పట్లూరి శ్రీనివాస్, బాజీ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై వీరాభిమానం చాటుకున్న బుల్లెట్ రాజు

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)**
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం నర్సాపూర్ ప్రధాన చౌరస్తాలో గులాబీ శ్రేణులు పండగలా నిర్వహించాయి. 10వ వార్డు కౌన్సిలర్ బుల్లెట్ రాజు ఆధ్వర్యంలో హరీశ్‌రావు భారీ చిత్రపటానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాలుస్తూ, కేక్ కట్ చేసి తీపి జల్సాలు చేసుకున్నారు. వీరాభిమాని బుల్లెట్ రాజు మాట్లాడుతూ.. నాడు మంత్రిగా హరీశ్‌రావు అందించిన అద్భుత సేవలను కొనియాడారు. ప్రియతమ నేతపై రాజు కనబరిచిన ఈ నిఖార్సయిన



ఆత్మీయతను చూసి జనమంతా ముక్తకంఠంతో ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు గౌడ్, రింగుల ప్రసాద్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాలుష్య రహిత సమాజానికి సైకిల్ సంకేతం

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)**
ప్రకృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని ఎఫ్ఆర్ఓ దివ్య పిలుపునిచ్చారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నర్సాపూర్ అటవీ శాఖ అధికారులు వినూత్నంగా పర్యావరణ స్పృహను చాటారు. స్థానిక అటవీ కార్యాలయం నుండి ప్రధాన కూడలి వరకు సిబ్బందితో కలిసి భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణే ధ్యేయంగా సాగిన ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఎఫ్ఆర్ఓ దివ్య మాట్లాడుతూ.. సైకిల్ తొక్కడం వల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్య రహిత సమాజ స్థాపనకు దోహదపడుతుందన్నారు. సిబ్బంది సైకిళ్లపై తరలివచ్చి ఇచ్చిన ఈ పర్యావరణ




సందేశం అత్యంత అభినందనీయమని, సమాజంలో మార్పునకు ఇదొక మంచి ఆదర్శమని పట్టణ ప్రజలు అభిప్రాయపడ్డారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరాంసింగ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సాయిరాం, కరీముద్దీన్, రాజమణి, శ్రీధర్, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనహృదయ నాయకుడు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూన్ 03:**
తెలంగాణ ప్రజల ఆశాజ్యోతి, జనహృదయ నాయకుడు తన్నీరు హరీశ్ రావు జన్మదిన వేడుకలు తూప్రాన్ మున్సిపల్ పరిధిలో బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా భారీ కేక్ కటింగ్‌తో పాటు







అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సేవాభావాన్ని చాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హరీశ్ రావు ప్రజాసేవ, తెలంగాణ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడుతూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో వైస్ చైర్‌పర్సన్ సమత కాశిరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు



# ఉపాధి హామీ పనిలో విషాదం

- వడదెబ్బతో కూలీ మృతి
- మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం
- ప్రభుత్వ సహాయం కోసం అధికారులకు విజ్ఞప్తి

**అందోల్, (ప్రజా జ్యోతి):**
నేరేడు గుంట గ్రామపంచాయతీ పరిధిలోని మక్తాగూడెం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బేగరి సుధాకర్ (55) మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయంలో తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కష్టపడి కుటుంబాన్ని పోషిస్తున్న







సుధాకర్ ఆకస్మిక మరణం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సాయికిరణ్ యాదవ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి తక్షణ సాయంగా తన తరపున రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఘటనను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ తెలిపారు. బేగరి సుధాకర్ వడదెబ్బ కారణంగా మృతి చెందిన నేపథ్యంలో అధికారులు ప్రాథమిక వివరాలను నమోదు చేసుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కాగా బుధవారం గ్రామంలో జరుగిన అంత్యక్రియల కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోదండ ఈశ్వర్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ సంగమేశ్, గ్రామ పెద్దలు మరియు పలువురు గ్రామస్తులు పాల్గొని మృతునికి ఘన నివాళులు అర్పించారు. బేగరి సుధాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. గ్రామీణ కూలీల భద్రత, తీవ్ర ఎండల సమయంలో ఉపాధి హామీ పనుల నిర్వహణపై మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రియతమ నేతపై చెరగని 'రాజు' ముద్ర

- నర్సాపూర్‌లో అంబరాన్నంటిన మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు
- భారీ చిత్రపటానికి పూలమాలలు, క్షీరాభిషేకం.. టపాసుల హోరు, కేక్ కటింగ్‌తో సంబరాలు
- నిజమైన అభిమాని అంటే ఇతనే అంటూ ముక్తకంఠంతో కొనియాడిన స్థానికులు

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరగని నిరంతర శ్రామికుడు, మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావుపై తనకున్న అచంచలమైన వీరాభిమానాన్ని 10వ వార్డు కౌన్సిలర్ బుల్లెట్ రాజు అత్యంత ఘనంగా చాటుకున్నారు. బుధవారం హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని నర్సాపూర్ పట్టణ




కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బుల్లెట్ రాజు ఆధ్వర్యంలో శ్రేణులు, అభిమానులు అట్టహాసంగా సంబరాలు జరుపుకున్నారు.


**పాలధారలు.. టపాసుల హోరు..**
వేడుకల్లో భాగంగా మొదటగా పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన హరీశ్‌రావు భారీ చిత్రపటానికి కౌన్సిలర్ బుల్లెట్ రాజు పూలమాల సమర్పించి, ఘనంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం గగనతలాన్ని తాకేలా భారీ ఎత్తున విరజిమ్మిన టపాసుల వెలుగులు, శ్రేణుల నినాదాల మధ్య భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. 'జైహో హరీశ్‌రావు.. వర్ధిల్లాలి ప్రజానేత' అంటూ గులాబీ దళం చేసిన నినాదాలతో నర్సాపూర్ పురవీధులు మారుమోగాయి. వీరాభిమాని బుల్లెట్ రాజు భావోద్వేగంగా మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల కోసమే తపించే ప్రజా హృదయ విజేత హరీశ్‌రావుపై తనకు నాడు, నేడు, ఏనాడైనా చెరగని, అభిమానం ఉంటుందని చాటారు. నాడు మంత్రిగా నీటిపారుదల, వైద్య ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో రాష్ట్ర ప్రగతికి ఆయన చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. తన ప్రియతమ నేత ఆయురారోగ్యాలతో నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**టాక్ ఆఫ్ ది టౌన్..**
కౌన్సిలర్ బుల్లెట్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల జోష్, హరీశ్‌రావుపై ఆయన కనబరిచిన నిఖార్సయిన ఆత్మీయ అనుబంధాన్ని చూసి అక్కడికి చేరిన జనమంతా నిజమైన అభిమాని అంటే ఇతనే అంటూ ముక్తకంఠంతో కొనియాడడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, 10వ వార్డు ఇన్‌చార్జ్ దుర్గప్పగారి నాగరాజు గౌడ్, సీనియర్ నాయకులు రింగుల ప్రసాద్, పట్టణ ప్రముఖులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అయినాపూర్ గ్రామ సమస్యలు పరిష్కరించాలి

– గ్రామ పంచాయతీ కార్యదర్శికి సిపిఎం వినతిపత్రం – గ్రామ సభ ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక చేపట్టాలని డిమాండ్

**కొమురవెల్లి, జూన్ 03 (ప్రజా జ్యోతి):–**
మండలంలోని అయినాపూర్ గ్రామంలోని పలు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి గ్రామ ప్రజలను ఆదుకోవాలని సిపిఎం గ్రామ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజుకు సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు తేలు ఇస్తారీ మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ వాటర్ ప్లాంట్ ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని, దానిని శుభ్రపరచి సర్వీసింగ్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా సరిపడా నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికను గ్రామ సభ ద్వారా పారదర్శకంగా నిర్వహించి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. రాజకీయ పార్టీల పేరుతో అర్హులను పక్కన పెట్టి తప్పుడు పద్ధతుల్లో ఎంపికలు



జరగడం దురదృష్టకరమని విమర్శించారు. గ్రామంలో సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా స్థల సేకరణ జరగకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. ఇరిగేషన్ భూముల కబ్జాలపై అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని, బీడీ కార్మికులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పట్టించుకోకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను ఏకం చేసి గ్రామపంచాయతీ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఉల్లంపల్లి సాయిలు, గ్రామ కార్యదర్శులు సున్నం యాదగిరి, కానుగుల రాజు, కర్రోల్ల ఎల్లయ్య, పాశం చంద్రయ్య, మల్లం అంజయ్య, కర్రోళ్ల లెనిన్, రాకేష్, పబ్బోజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**మిరుదొడ్డి, జూన్ 3, (ప్రజా జ్యోతి):**
మండల పరిధిలోని అందె గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ప్రజాప్రతినిధులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లిన గ్రామ సర్పంచ్ కడారి యాదగిరి కూలీలతో ముచ్చటించి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శారీరక శ్రమ చేసే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో ఉపాధి హామీ కూలీల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సర్పంచ్ కడారి యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాట్లా పరశురాములు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# హరీష్ రావుకు ప్రేమతో

నాయకుడి పై అభిమానాన్ని చాటుకున్న కీసరి పాపయ్య



**చిన్నకోడూరు, జూన్03, (ప్రజాజ్యోతి):–**
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పుట్టినరోజు సందర్భంగా చిన్నకోడూరు మండల మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య తన అభిమానాన్ని ప్రత్యేకంగా చాటుకున్నారు. హరీష్ రావు జన్మదిన సందర్భంగా తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం హరీష్ రావు అందుబాటులో లేకపోవటంతో తీసుకొచ్చిన లడ్డు ప్రసాదాన్ని ఆయన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి తిరుపతి లడ్డు ప్రసాదాన్ని సమర్పించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు హరీష్ రావు అని పాపయ్య కొనియాడారు. సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో హరీష్ రావు కొనసాగాలని ఆకాంక్షించారు. జన నేతపై పాపయ్యకు ఉన్న అభిమానాన్ని చూసి పార్టీ శ్రేణులతో పాటు, పలువురు అభినందించారు.

# ఘనంగా మల్కాజ్‌గిరి జోన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు ఉత్సవాలు





- విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**బోయిన్ పల్లి, జూన్ 03 (ప్రజాజ్యోతి) :** వెస్ట్ మారేడ్‌పల్లి లోని క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన మల్కాజ్‌గిరి జోన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు-2026 ముగింపు ఉత్సవాలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. చిన్నారులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మల్కాజ్‌గిరి జోన్ అధికారులు క్రీడాకారులను తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషిని అభినందించారు. అన్ని పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్, కరాటే, కుంగ్ ఫూ శిక్షణను తప్పనిసరి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ గాయత్రి, క్రీడా అధికారులు, కోచ్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే ప్రాణ రక్షణ

రసూల్‌పురాలో కెఈఐ ఇండస్ట్రీస్‌లో ఏసిపి శంకర్ రాజ్ అవగాహన కార్యక్రమం




**బోయిన్ పల్లి, జూన్ 3.(ప్రజా జ్యోతి) :** రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు సూచించారు. బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రసూల్‌పురాలో ఉన్న కె ఈ ఐ ఇండస్ట్రీస్‌లో బుధవారం నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘన, ట్రిపుల్ రైడింగ్, మైనర్లతో వాహనాలు నడిపించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కే ఈ ఐ ఇండస్ట్రీస్ మార్కెటింగ్ మేనేజర్ జి. భార్గవ్, జనరల్ మేనేజర్ రవి కిరణ్, హెచ్‌ఆర్ ప్రతినిధి షాలిని పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరై ట్రాఫిక్ భద్రతపై అవగాహన పొందారు.

# నవ కంటోన్మెంట్ నిర్మాణమే లక్ష్యం

- బొల్లారంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ క్షేత్రస్థాయి పర్యటన




**బోయిన్ పల్లి, జూన్ 3.(ప్రజా జ్యోతి):** నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం బొల్లారంలోని జనప్రియ బంగ్లా, శాంతినగర్ కాలనీ, గడ్డి బస్తీలలో విస్తృతంగా పర్యటించారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బస్తీల్లో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర మౌలిక వసతులపై స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ నవ కంటోన్మెంట్ లక్ష్య సాధన కోసం అన్ని కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా కార్యాచరణ రూపొందించి దశలవారీగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, నాని, రామచంద్రారెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విధి నిర్వహణలో అలసత్వం చేయొద్దు






- ప్రజలకు నమ్మకమైన సేవలందించాలి
- తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్లో తనిఖీ చేసిన ఎస్పీ
- పలు రికార్డుల పరిశీలన
- ప్రమాదకరమైన నేరస్థులపై నిఘా పెట్టాలి
- శాంతి భద్రతల పరిరక్షణ పై నిర్లక్ష్యం చేయొద్దు
- సీసీ కెమెరా పనితీరును పరిశీలించాలి
- కేసుల పురోగతిపై సూచనలు చేసిన ఎస్పీ
- పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి
- జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా పోలీస్ అధికారులకు ఆదేశాలు

**తాండూరు జూన్ 3 ప్రజా జ్యోతి :** పోలీసులు విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించొద్దని వికారాబాద్ జిల్లా ఎస్పీ (సూపర్డెం ట్ ఆఫ్ పోలీస్) స్నేహమేహ్రా పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. బుధవారం రోజు తాండూ రు పట్టణ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీలలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కీలకమైన రికార్డులను తనిఖీ చేయడంతో పాటు పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. పోలీ సులు ప్రజలకు మరింత సమర్థవం తమైన, పారదర్శకమైన సేవలందిం చడమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రతపై అలసత్వం చేయొద్దని హెచ్చరించారు. ము ఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు , కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చొరవ చూపాలన్నారు. పోలీసులకు-ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబా టులో ఉండి పోలీసులపై మరింత గా గౌరవం పెంచుకునేలా విధులు నిర్వహించాలన్నారు. ఎవరికి అప్పగించిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును కూడ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల రక్షణకు భరోసా కల్పించే కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. చిన్నపిల్లలు మహిళలపై జరిగే నేరాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అంతే కాకుండా బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు చేదించడంలో వేగవంతం చేయాలని అధికారు లను ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక తను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని సూచించారు. పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రాబోయే ప్రతిష్ఠాత్మకమైన బోనాల జాతర, మొహర్రం పండుగలను పురస్కరిం చుకుని శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మకమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింతగా బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఇట్టి కార్యక్ర మంలో తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ఎస్ఐ లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ అప్రమత్తం..



- పరిగిలో బిఎల్ఏల శిక్షణ శిబిరం
- ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించిన టీపిసిసి ట్రైనర్లు
- ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలి : ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి



**పరిగి, జూన్ 3 (ప్రజా జ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ పరిగి పట్టణంలోని ఎన్‌కే కన్వెన్షన్ హాల్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ) శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గానికి చెందిన 305 బూత్‌ల బిఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిబిరంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించిన ప్రత్యేక ట్రైనర్లు ఎం. రాఘవేందర్ రెడ్డి, నరేష్ రాథోడ్, డా. పి. రాజశేఖర్ రెడ్డి, పి. రాజేష్, మోహన్‌లు ఎస్ఐఆర్ విధివిధానాలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బిఎల్ఏల బాధ్యతలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమని, ఓటర్ల హక్కులను హరించే ఎలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు జాతీయ నాయకత్వం ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం ఎస్ఐఆర్ అంశంపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా కొన్ని ప్రాంతాల్లో అన్యాయంగా ఓటర్ల పేర్ల తొలగింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు. శిబిరంలో ట్రైనర్లు కొత్త ఓటర్ల నమోదు విధానం, 18 సంవత్సరాలు పూర్తయిన యువతను ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ, ఓటరు జాబితాలో పేరు, చిరునామా మార్పులు, తొలగింపులు, సవరణల కోసం అనుసరించాల్సిన విధివిధానాలను బిఎల్ఏ లకు వివరించారు. కొత్త ఓటర్ల నమోదుకు అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు విధానాలపై కూడా అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండటంతో పాటు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, మహిళలు అలాగే ఇతర అర్హులైన పౌరులను ఓటర్లుగా నమోదు చేయడంలో బిఎల్ఏ లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో అనేక నియోజకవర్గాల్లో అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో గెలుపోటములు నమోదయ్యాయని, పలువురు మాజీ ముఖ్యమంత్రులు సైతం ఓటమిపాలయ్యారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి గుర్తు చేశారు. ప్రతి ఓటు ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించే శక్తి కలిగి ఉన్నందున బిఎల్ఏలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బిఎల్ఏలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోతే అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడే ప్రమాదం ఉందని, తద్వారా కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రతి బిఎల్ఏ తన బూత్ పరిధిలోని ఓటరు జాబితాను నిరంతరం పరిశీలిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. టీపీసీసీ ఎస్ఐఆర్ ట్రైనింగ్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, బిఎల్ఏలు, నాయకులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దారా సింగ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పరిగి మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో కటౌట్ల జాతర






- సంబరాల వెనుక భద్రతా భయం..!
- కారణం ఇద్దరు నెతల జన్మదినం ఒకే రోజున రావడం
- పోటా పోటీగా ఫ్లెక్సీల ఏర్పాటు

**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 03(ప్రజా జ్యోతి) :** వికారాబాద్ పట్టణం ప్రస్తుతం రాజకీయ వేడుకలతో కళకళలాడుతోంది. ఎన్నేపల్లి చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వీధులను పండుగలా మార్చేశాయి. కారణం ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఇద్దరి జన్మదినాలు జూన్ 4న ఒకే రోజున రావడం. ఇద్దరు నేతల అభిమానులు పోటీపడి భారీ హోర్డింగ్స్, బ్యానర్లు ఏర్పాటు చేస్తూ తమ అభిమానాన్ని చూపిస్తున్నారు. పట్టణం మొత్తం రాజకీయ ఉత్సవ వాతావరణంలో మునిగిపోయింది. అయితే ఈ సంబరాల మధ్య భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇటీవల వీస్తున్న ఈదురు గాలుల కారణంగా రోడ్లపై ఉన్న భారీ ఫ్లెక్సీలు ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇది ప్రజల ప్రాణాలకు ముప్పు కావచ్చని వారు అంటున్నారు. ఈ ఫ్లెక్సీలకు అనుమతులు ఉన్నాయా? ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న వాటిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలపై కఠినంగా వ్యవహరించే అధికారులు, రాజకీయ అభిమానుల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిజంగా పర్యవేక్షిస్తున్నారా? లేక చూస్తూ ఊరుకుంటున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే, స్థానిక ప్రజలు ఇద్దరు నాయకులకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, నియోజకవర్గ అభివృద్ధికి వారు చేసిన కృషిని అభినందిస్తున్నారు. మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంబురాలు జరగడం తప్పు కాదు... కానీ కటౌట్ల ద్వారా వ్యక్తమవుతున్న అభిమానంతో పాటు ప్రజల భద్రత, నిబంధనల అమలు కూడా సమానంగా ప్రాధాన్యత పొందాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఎస్‌బిపల్లిలో ఎమ్మె సంతోష దశదిన కర్మ

- హాజరై నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ



**కొత్తూర్ జూన్ 03 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎమ్మె రమేష్ భార్య ఎమ్మె సంతోష దశదిన కార్యక్రమాన్ని బుధవారం కుటుంబ సభ్యులు వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వద్దే బాలయ్య, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మె నరసింహ, ఎమ్మె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ సర్కిల్‌లో ఎటువంటి పర్మిషన్ లేకుండా భారీ అక్రమ నిర్మాణాలు

- సర్కిల్ మారిన పనితీరు మారడం లేదు




**శేరిలింగంపల్లి, జూన్ 03 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మాదాపూర్ సర్కిల్లో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమాకు ఏమీ తెలియదు అన్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా ఎటువంటి పరిమిషన్ లేకుండా ఏడు ఎనిమిది అంతస్తులు నిర్మిస్తున్న సీఎంసి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీ, చంద్ర నాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా, తదితర ప్రాంతాలలో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎటువంటి పరిమిషన్ లేకుండా సెల్లార్ లతో సహా భారీగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. అధికారులు మారిన సర్కిల్ మారిన పనితీరు మారడం లేదని పాత అధికారుల బాటలోనే కొత్త సీఎంసి అధికారులు నడుస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. స్థానిక ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పలు పత్రికలలో వార్తలు ప్రచురించిన వాట్సప్ ల ద్వారా వారి దృష్టికి తీసుకెళ్లిన స్వయంగా తెలిపిన ముడుపులకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం. తమకు రావలసింది వస్తుంది ఎవరు ఎన్ని అంతస్తులు వేసిన డోంట్ కేర్ మాది మాకు వస్తే చాలు అని భ్రమలో అధికారులు నిద్ర మత్తులో ఉన్నారు. అయ్యప్ప సొసైటీలో అన్ని కమర్షియల్ నిర్మాణాలే హాస్టల్లో, కాలేజీలు, పాఠశాలలు ఐటీ కి సంబంధించిన ఆఫీసులు రెస్టారెంట్లు హోటల్లు తదితర కమర్షియల్ నిర్మాణాలే సిఎంసి అధికారులు మాత్రం వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తెలిపారు. తమకు సరైన మౌలిక వసతులు లేవని ఇటువంటి అక్రమ నిర్మాణాల వల్ల త్రాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య, రోడ్ల సమస్య ఇటువంటి సమస్యలను పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలను సిఎంసి అధికారులు రాజకీయ నాయకులు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ కమర్షియల్ అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయం భారీగా అధికారుల జేబులోకి వెళుతుందని ప్రభుత్వానికి భారీ గండి పడుతున్నాయని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అదేవిధంగా కొందరు మధ్యవర్తులు అధికారులతో కలిసి అంతా మేమే చూసుకుంటాం మీ నిర్మాణాలకు డోకా లేదు అని చెప్పి యజమానుల దగ్గర బిల్డర్ ల దగ్గర ముడుపులు వసూలు చేస్తున్నారని గుసగుసలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సిఎంసి అధికారులు డిసి బాలకృష్ణ, ఏసీబీ సురేందర్ రెడ్డి, టీపీఎస్ సంతోష్ కుమార్ ఇట్టి అక్రమ నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## కొత్త పేటలో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన

కొండపల్లి జూన్ 2, ప్రజా జ్యోతి
ఖేత్ బచావో అభియాన్ లో బాగంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులపై మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ ప్రాంగణంలో బుధవారం రోజున మండల వ్యవసాయాధికారి కె. మహేష్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రైతుల్లో నేల ఆరోగ్యం పరిరక్షణ సమతుల్య ఎరువుల వినియోగం పుస్తక వ్యవసాయ పద్ధతులపై



అవగాహన పెంపొందిస్తూ. మరి కొయ్యలను కాల్చివేస్తే ఎదురయ్యే నష్టాలు,వివరిస్తూ, వరి వేసే రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న రకాలను సాగు చేయాలని సూచించడం జరిగింది.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు తక్కువ పడే అవకాశం ఉందని తక్కువ నీటి లభ్యత వున్న రైతులు వరికి బదులుగా ఆరు తడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి , వ్యవసాయ విస్తరణ అధికారిని మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లికి గంగాస్నానం..నాచుపల్లిలో ఘన స్వాగతం

కొడిమ్యాల,జూన్ 03,(ప్రజాజ్యోతి):
మండలం నాచుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఐదేళ్ళకు ఒక సారి ఘనంగా నిర్వహించే ఎల్లమ్మ సిద్దోగం కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ధర్మపురి గంగ స్నానానికి తీసుకెళ్లి, సాయంత్రం నాచుపల్లి గ్రామంలో ఊరేగింపుగా గౌడ సంఘం



ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, పల్లె రాంగోపాల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అనిల్ గౌడ్, విక్రమ్ గౌడ్, రంజిత్ గౌడ్, సాయినాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం: నర్సింహుల పల్లి గ్రామసభలో టెన్త్ విజేతలకు ఘన సత్కారం!

బీర్పూర్, జూన్ 03 (ప్రజా జ్యోతి):
బీర్ పూర్ మండలంలోని నర్సింహులపల్లి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలను (అడ్మిషన్లు) పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సభలో సుదీర్ఘంగా చర్చించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరుప నాగభూషణం తెలియజేశారు.
గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను గ్రామ సర్పంచ్ సృజన సుశీన్ ప్రత్యేకంగా అభినం






దించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆ ముగ్గురు విద్యార్థులకు రూ. 5,000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. దాంతో పాటు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఇతర విద్యార్థులకు పాఠశాల తరపున ప్రతిభా పురస్కారాలుగా మెమొంటోలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ సృజన సుశీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడిపుంజుల పల్లె ప్రాథమిక పాఠశాల లో బడిబాట కార్యక్రమం,

ఎండపల్లి,జూన్ 3 , ప్రజా జ్యోతి
బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టాయి. అందులో భాగంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని గుల్లకోట



లోని కోడిపుంజుల పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ బడిలోని బోధన, వసతులపై ప్రజలను చైతన్యం చేస్తూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని, ప్రజల భాగస్వామ్యంతో,ప్రజా ప్రతినిధులు సహకారంతో ప్రధానోపాధ్యాయురాలు, జ్యోతి,ఉపాధ్యాయురాలు అరుణ ఉత్సాహంగా బడిబాట కార్యక్రమం చేపట్టారు.ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ విచ్చేసి బడిబాట కార్యక్రమం లో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఉపాధ్యాయురాలు అరుణ, యువత , గ్రామస్తులు పాల్గొన్నారు

## బీర్ పూర్ ప్రభుత్వ పాఠశాలలో 'బడిబాట' కరపత్రాల ఆవిష్కరణ

బీర్పూర్, జూన్ 03 (ప్రజా జ్యోతి):
బీర్ పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా 800 కరపత్రాలను ముద్రించారు. వీటిని గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, మండల విద్యాధికారి సిరూప నాగభూషణం సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని కొనియాడారు. ఈ ఏడాది కూడా 8 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు ఉచితంగా రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తున్నారని తెలిపారు. డిజిటల్ విద్య, బోధన ఉపకరణాల ద్వారా నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఇక్కడ విద్యాబోధన చేస్తున్నారని, కావున తల్లిదండ్రులు తమ




పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్యను మరింత పెంచడానికి గ్రామంలోని ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం, యువత సహకారం ఎంతైనా అవసరమని కోరారు. మండల విద్యాధికారి సిరూప నాగభూషణం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకోవడం ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏ. జితేందర్ గౌడ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సముద్రాల శ్రీలత, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, భోగ నాగరాణి, బాణావత్ స్వరూప, బి. మౌనిక, విద్యార్థుల తల్లిదండ్రులు యశోద, రమేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుర్షేడ్‌లో కలుషిత నీటి కలకలం

- చెత్తకుప్పగా మారిన త్రాగునీటి బావి
- కలుషిత నీటితో వ్యాధుల భయం
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ఇబ్బందులు
- బోర్లు బంద్.. నీటి కోసం ప్రజల నిరీక్షణ

కరీంనగర్ రూరల్,జూన్ 03,ప్రజాజ్యోతి:
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్షేడ్ ప్రాంత ప్రజలు తీవ్ర త్రాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.డివిజన్‌లోని మూడు వాటర్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే ప్రధాన బావి నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
చెత్తతో నిండిన బావి.. కలుషితానికి కేంద్రం...
ప్రజలకు త్రాగునీరు అందించే బావికి రక్షణ కప్పు లేకపోవడంతో చెత్తాచెదారం నేరుగా బావిలో పడుతోంది. బావి చుట్టూ పరిశుభ్రత లేకపోవడం వల్ల అది మురికికూపంలా మారిందని స్థానికులు చెబుతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడి కూడా చల్లడం లేదని వారు ఆరోపిస్తున్నారు.
స్మశానం, వాగు సమీపంలో ఉండటంతో మరింత ప్రమాదం...
బావికి ఎగువ భాగంలో స్మశానం ఉండటంతో పాటు పక్కనే వాగు ప్రవహిస్తోంది. స్మశానంలో వదిలివేసిన చెత్త గాలికి బావిలో పడిపోతుండగా, మూగజీవాల కళేబరాలను వాగులో వేయడం వల్ల నీరు మరింత కలుషితం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
బోర్లు పనిచేయక నీటి కష్టాలు...
డివిజన్‌లో కొన్ని బోర్లు పనిచేయకపోవడంతో ప్రజలకు త్రాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యాయి.కొత్త బోరు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందించాలని,అలాగే ప్రస్తుతం ఉన్న బావికి పైకప్పు ఏర్పాటు చేసి సరైన నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గేట్‌వాల్ లీకేజీల కారణంగా కూడా నీరు కలుషితమవుతోందని వారు చెబుతున్నారు.
సమస్యలు చెప్పుకునే అధికారే లేరని వేదన...
దుర్షేడ్ ప్రాంతం గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు సమస్యలను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కారం లభించేదని స్థానికులు గుర్తు



చేస్తున్నారు.నగరపాలక సంస్థలో విలీనం అయిన తర్వాత ఏ సమస్యను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని అంటున్నారు.
ఒక హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలి..
సానిటేషన్, విద్యుత్, మంచినీటి వంటి విభాగాలకు వేర్వేరు అధికారులు ఉండటంతో ప్రజలకు ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు.డివిజన్ కార్యాలయంలో సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శించడంతో పాటు, ప్రజల సమస్యలను స్వీకరించే ఒకే హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
అధికారులు స్పందించకపోతే ఆరోగ్య సమస్యల ముప్పు...
కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు అంటువ్యాధులు,ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావి శుద్ధి,బోర్ల మరమ్మతులు, త్రాగునీటి సరఫరా మెరుగుదలపై తక్షణ చర్యలు చేపట్టాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

## స్వచ్ఛ గావ్ సురక్షిత జలవాయు ప్రచార ప్రత్యేక కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దపల్లి ప్రతినిధి, జూన్ – 03 ప్రజా జ్యోతి;
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే




ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమాలను పెద్దపల్లి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జూన్ 5వ తేదీ వరకు నిర్వహించాల్సిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, సుస్థిర జీవనశైలిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల జిల్లా కలెక్టర్ వివరించారు. జూన్ 2: గ్రామ పంచాయతీల పరిధిలోని కమ్యూనిటీ ఘన వ్యర్థాల నిర్వహణ ఆస్తుల స్థితిని సందర్శించి, క్షేత్రస్థాయిలో మదింపు చేయడం,సదరు వివరాలను SBM(G) IMIS పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, జూన్ 3: గ్రామంలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను (BWG) గుర్తించి, వారి జాబితాను తయారు చేయడం, జూన్ 4: అవగాహన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, సామాజిక భాగస్వామ్యంతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం. ఇందులో మిషన్ లైఫ్, SBM(G) 2.0 అంశాలపై అవగాహన కల్పించడం, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్రత్యేక గ్రామ సభ' నిర్వహించడం. ఈ సభలో SWM నియమాలు, వ్యర్థాల నిర్వహణ, సాధించిన పురోగతిపై చర్చించి, వివరాలను MoPR పోర్టల్‌లో నమోదు చేయడం, మిషన్ లైఫ్" థీమ్ ద్వారా వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, బిసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శాత్రాజూపల్లి గ్రామంలో అగ్నిప్రమాదం – గీత కార్మికుల ఉపాధికి తీవ్ర నష్టం

వేములవాడ,జూన్,3:ప్రజాజ్యోతి
శాత్రాజూపల్లి గ్రామ పరిధిలోని పరంపొగు ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో పెద్ద సంఖ్యలో ఈత, తాటి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో గీత కార్మికుల జీవనాధారం తీవ్రంగా దెబ్బతింది. అనేక సంవత్సరాలుగా గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఉపాధిని కోల్పోయి ఆందోళన చెందుతున్నాయి. ఈ ఘటనపై గౌడ సంఘం అధ్యక్షులు విక్కుర్తి నారాయణ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం వల్ల గీత కార్మికులకు అపార నష్టం వాటిల్లిందని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధిత గీత కార్మికులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. అలాగే దగ్ధమైన ఈత, తాటి చెట్ల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, వారి ఉపాధి పునరుద్ధరణకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## మనకొండూర్ ఎం ఎల్ ఏ ను మర్యాదపూర్వకంగా కలిసిన పెద్ద లింగాపూర్ సర్పంచ్ వసంత నర్సయ్య

ఇల్లంతకుంట జూన్ 3(ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య పాలకవర్గ సభ్యులు బుధవారం రోజు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ



సందర్భంగా సర్పంచ్ గన్నేరం వసంత మాట్లాడుతూ గ్రామంలో ఉన్న కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తప్పకుండా సహకరిస్తానని కావలసిన నిధులు మంజూరు చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాజీ ఎం పీ పి రమణారెడ్డి ఇల్లంతకుంట సర్పంచ్ M రాజు ఉప సర్పంచ్ ఎలవేని రమేష్ వార్డు సభ్యులు విజయ ,రాణి, మరియ, లక్ష్మి , అనిల్ కుమార్, శ్రీనివాస్ ,రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## రైతు బీమా చెక్కు పంపిణీ....

ప్రజాజ్యోతి,కోరుట్ల రూరల్, జూన్ 3,
కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతు దండే నరసింహ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బీమా పథకం ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి ఆయన భార్యకు అందజేశారు.
ఈ సందర్భంగా రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రజా




ప్రభుత్వానికి లబ్ధిదారులు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు , జువ్వాడి కృష్ణారావు లకు కృతజ్ఞతలు తెలిపారు.
రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి డైరెక్టర్ బాపు రెడ్డి,ఎంపీటీసీ సుభాష్ రెడ్డి, సల్ల మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి రెండు ఆవుల మృతి.. రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం

రాయికల్, జూన్ 03 (ప్రజా జ్యోతి)
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా కడెం మండలం పెరికపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సత్తెన్నకు చెందిన రెండు ఆవులు



ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందాయి. స్థానికుల వివరాల ప్రకారం, బోర్నపల్లి గ్రామ శివారులో మేస్తున్న సమయంలో ఆవులు ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. దీంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో రైతు బొడ్డు సత్తెన్నకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. తన జీవనాధారంగా ఉన్న ఆవులు మృతి చెందడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పశువుల మృతితో తనకు గణనీయమైన నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పందించి తగిన పరిహారం అందించాలని కోరాడు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, రైతుకు న్యాయం చేయాలని గ్రామస్థులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చొప్పదండి, జూన్ 3 (ప్రజాజ్యోతి):
చొప్పదండి మున్సిపాలిటీ 9వ వార్డులో నివాసం ఉంటున్న కాంపల్లి శ్రీనివాస్(45) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా



అంత్యక్రియల కోసం రామకృష్ణ సేవాసమితి సభ్యుడు సాంబారి శ్రీనివాస్ రూ.5000 ఆర్థిక సాయం అందించారు. మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత చేతుల మీదుగా ఆర్థిక సాయం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు దాత శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కొక్కుల కనకయ్య, పడకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాల మెరిట్ జాబితా విడుదల

ఇల్లంతకుంట జూన్ 3(ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట్ మోడల్ స్కూల్ లో 6వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ జి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 వ తరగతి కి మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం 97 మంది ఎంపికైనట్లు వివరించారు. ఇంటర్ ప్రవేశానికి ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తుల్లో పదో తరగతి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.ఎంపిక జాబితాను పాఠశాల నోటీస్ బోర్డు లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు ఈ నెల 6వ తేదీ వరకు టీసీ, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మార్కుల జాబితా, 3 ఫోటోల తో పాటు 2 సెట్ల జిరాక్స్ కాపీలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.


## కుమారుడి పుట్టినరోజు. సందర్భంగా దివ్యాంగులతో వేడుక

సుల్తానాబాద్ జూన్ 3 ( ప్రజా జ్యోతి )
పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను చాటుకున్న నారాయణపూర్ గ్రామానికి చెందిన



కుటుంబం ఆదర్శంగా నిలిచింది. సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బోబ్బిడాల ప్రశాంతి–రాకేష్ దంపతుల కుమారుడు తేజస్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక వికలాంగుల పునరవాస కేంద్రంలో వికలాంగులకు బిర్యానీ పంపిణీ చేశారు.
శ్రీనిధి సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రాకేష్ తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలోని వికలాంగులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుని వారికి బిర్యానీ అందజేసి ఆనందాన్ని పంచుకున్నారు.
ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.
ఈ కార్యక్రమంలో కల్లెపల్లి శంకర్, తో పాటు పలువురు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని తేజస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బాలికల వసతి గృహంలో 'కొండచిలువ కలకలం



**సత్తుపల్లి జూన్03 (ప్రజా జ్యోతి)**
పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో బుధవారం ఉదయం ఓ కొండచిలువ కలకలం రేపింది. హాస్టల్ లోకి ప్రవేశించిన కొండచిలువను గుర్తించిన విద్యార్థులు,సిబ్బంది సమాచారాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అదే శాఖలో బీట్ ఆఫీసరుగా, పనిచేస్తూ రిటైర్డ్ అయిన ప్రముఖ స్నేక్ క్యాచర్ మొహమూద్ పిలిపించారు. మొహమూద్ వెంటనే బాలికల వసతి గృహానికి చేరుకొని కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. 12 అడుగుల పొడవున్న ఈ కొండచిలువను పట్టుకుంటున్న క్రమంలో స్నేక్ క్యాచర్ మొహమూద్ మెడను చుట్టేసి మల విసర్జన చేసింది. పట్టుకున్న కొండచిలువను మొహమూద్ అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వసతి గృహంలోని అప్పటివరకు ఆందోళనకు గురైన బాలికలు అటవీశాఖ వారు వచ్చి కొండచిలువను పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకు స్నేక్ కేచర్ మహమూద్ సుమారుగా 60 వరకు వివిధ రకాల పాములు కొండచిలువలను పట్టుకున్నారు.

# మానవ మనుగడకు మొక్కలు జీవనాధారం

## - డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ

**సత్తుపల్లి జూన్03(ప్రజా జ్యోతి)**
సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా, ఉన్నతాధికారుల ఆదేశానుసారం మొక్కలను నాటారు. ఈ





సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన సందర్భంగా కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశానుసారం సత్తుపల్లి డిపో పరిధిలో సత్తుపల్లి తో పాటు అన్ని బస్టాండ్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. పర్యావరణహితం కోరే ప్రతి ఒక్కరూ మొక్కలు ఒక మొక్క చొప్పున నాటినట్లయితే, పర్యావరణాన్ని కాపాడుకున్న వాళ్ళం అవుతామని అన్నారు. మొక్కలు నాటే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సత్తుపల్లి డిపో పరిధిలోని అశ్వరావుపేట, కల్లూరు, వి ఎం బంజర బస్టాండ్లలోనీ ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటే విధంగా ప్రణాళికల సిద్ధం చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి ప్రవీణ్ కుమార్, ఎల్ హెచ్ కాంతారావు, టీ ఐ త్రీ లు ఆనందం, జాక బ్,ఏడీసీ విజయ్ కుమార్, డి ఐ ప్రభాకర్, వి బి ఓ కిన్నెర. ఆనందరావు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, రాంబాబు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సహకార బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

**చింతకాని జూన్ 03ప్రజాజ్యోతి :**
చింతకాని కేంద్ర సహకార బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఊదారపు నాగేశ్వరరావు బదిలీపై మధిర బ్యాంకుకు వెళ్లుచున్న సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారు బ్యాంకుకు అందించిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు .ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రీటా,సొసైటీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, కార్యదర్శులు వై శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు,అసిస్టెంట్ మేనేజర్ వంకాయలపాటి దీపిక , క్యాషియర్ జి.లావణ్య, సిబ్బంది అసిస్టెంట్ ఎం.భవ్య మేసింజర్ పర్వతాలు,తదితరులు పాల్గొన్నారు.



## రూ.12 లక్షలతో నిర్మించిన నూతన

# అంగన్‌వాడీ భవనం ప్రారంభం చేసిన ఎమ్మెల్యే పాయం

**పినపాక,జూన్ 03(ప్రజాజ్యోతి):**
చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పినపాక మండలంలోని సీతారాంపురం గ్రామపంచాయతీలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని స్థానిక సర్పంచ్ సనప అనితతో కలిసి పినపాక ఎమ్మెల్యే పాయం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం,





ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని తెలిపారు.పిల్లల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు మహిళా, శిశు సంక్షేమ రంగాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామనాథం , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ రమేష్, సిడిపిఓ జయలక్ష్మి, స్థానిక అంగన్వాడి టీచర్ జయ, సర్పంచులు, ఉపసర్పంచులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై అటవీశాఖ బైక్ ర్యాలీ

**పినపాక,జూన్ 03(ప్రజాజ్యోతి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ-బయ్యారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత తెలిపారు. అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఈ-బయ్యారం క్రాస్ రోడ్ వరకు, అక్కడి నుంచి ఉప్పాక బ్రిడ్జి వరకు, అనంతరం పినపాక జూనియర్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగించామని తెలిపారు. ర్యాలీ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వృక్ష సంపద పెంపుదలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులు ప్రకృతి సమతుల్యతకు మూలాధారమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అటవీ సంపదను కాపాడటం ద్వారా వన్యప్రాణులు, జీవ వైవిధ్యం రక్షించబడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మాధవి, వెంకటేశ్వర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీకి స్థానిక ప్రజలు కూడా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటవిశాఖ సిబ్బంది, ఎఫ్బిఓ లు పాల్గొన్నారు.




# పిల్లల్లో అసాధారణ ప్రతిభ ఉంటుందనడానికి అర్ఫాజ్ అలీ యే నిదర్శనం

- సత్తుపల్లిలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎంవీఎస్ కాశ్యప్
- ఖమ్మం శ్రేయాస్ వన్ సిటీ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు సత్కారం,అభినందనలు
- బిగ్ బాస్ ఫేం నటి దివి వాద్వా హాజరు



**సత్తుపల్లి జూన్03(ప్రజా జ్యోతి)**
విద్యార్థులకు అసాధారణ ప్రతిభ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనెల 13వ తేదీ నిర్వహించిన పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలో తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన, మహ్మద్ మహబూబ్ అర్ఫాజ్ అలీ యే నిదర్శనం అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేటర్ ఎంవీఎస్ కాశ్యప్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన అర్ఫాజ్ అలీ ని ఘనంగా సత్కరించి అభినందించారు. ఖమ్మం శ్రేయాస్ వన్ సిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలోని యంఆర్ గార్డెన్స్ లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సెమినార్ లో ఎంవీఎస్ కాశ్యప్ ముఖ్య అతిథిగా హాజరై వ్యాపారా భివృద్ధి,నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం,భవిష్యత్తు అవకాశాల పై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. మొట్టమొదటిసారి సత్తుపల్లి పట్టణంలో జరిగిన మోటివేషన్ ప్రోగ్రాంలో కాశ్యప్ ప్రసంగించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది.బిగ్ బాస్ ఫేం నటి దివి వాద్వా సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. విజయ సాధనకు బలమైన నిర్ణయాలు, కష్టపడే తత్వం గురించి శ్రేయస్ సిటీ వ్యవస్థాపకులు గంద్ర శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మువ్వా అశోక్ బాబు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**చింతకాని జూన్ 03 ప్రజాజ్యోతి :**
చింతకాని మండల తహశీల్దార్ బాబ్జి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మత్కేపల్లి ఎఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు,పాల్గొని తహశీల్దార్ బాబ్జి ప్రసాద్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని సన్నబియ్యం ఉచిత గృహ విద్యుత్ ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 30 వేల వరకు లబ్ధి చేకూరుతుందని అన్నారు అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, చేయూత,ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు పేద మరియు మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతికి దోహదపడుతున్నాయని అన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఈ ప్రజా ప్రభుత్వనికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, మత్కేపల్లి సర్పంచ్ కంచం ద్రౌపది,గాంధీనగర్ సర్పంచ్ ఓర్సు వీరభద్రం, పాతర్లపాడు సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి, జిల్లా ఆత్మ కమిటీ మెంబర్ కొప్పుల గోవిందరావు మత్కేపల్లి మార్కెట్ డైరెక్టర్ బందెల నాగార్జున,చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి,మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్,గాంధీనగర్ ఉప సర్పంచ్ ఒంగురి రమేష్ ,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ సేవాదళ్ అధ్యక్షులు పర్సగాని సతీష్,గ్రామ శాఖ అధ్యక్షులు పగడాల రాధాకృష్ణ కంచం కోటేశ్వరావు మరియు కాంగ్రెస్ నాయకులు బొల్లికొండ రామారావు,తాళ్ళూరి రమేష్ మరియు ఆర్ఐ ఏకవీర అధికారులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వామ్మో.. జూన్..!



- ప్రారంభం కానున్న పాఠశాలలు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైన గుబులు!
- ప్రైవేట్ పైనే మక్కువ!
- అధిక ఫీజులతో అతలాకుతలం
- నియంత్రణ లేని ఫీజులు? ఈసారైనా ఫీజులకు ప్రభుత్వం అడ్డుక ట్టవేసేనా?
- పుస్తకాలు, డ్రెస్సులు, షూస్ లతో ఆర్థిక భారం!

**ఇల్లందు, జూన్ 3, ప్రజాజ్యోతి:**
బడులు తెరుచుకొనున్నాయి. ఈ వార్త విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతుంది. జూన్ మాసం వస్తుందంటేనే తల్లిదండ్రులు ఆర్థిక భారం మోయలేక ఇబ్బందులు పడుతుంటారు. అప్పుడే విద్యార్థుల ఫీజులు కట్టే సమయం వచ్చిందా అంటూ ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, షూస్, ఇతర సామాగ్రి కొనుగోలు విషయాల్లో ఆందోళన చెందుతుంటారు. ఇటీవలే వార్షిక పరీక్షల ఫీజుతో భారం మోయగా, ఇప్పుడు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

**ప్రైవేట్ పైనే మక్కువ... ఇదే ఫీజులకు ఆసరా**
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక కల్పించకపోవడం, ఉపాధ్యాయుల కొరత తీర్చకపోవడం వంటి కారణాలతో పాటు కొందరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు



నిర్వహిస్తుండడం కారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో విద్యార్థుల దురభిప్రాయం ఏర్పడింది. ఇక బాలికలకు ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో సరైన సదుపాయాలు కల్పించరనే అపోహ కూడా ఉండడం కారణంగా బాలికలను ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆర్థికంగా ఉన్న వారితో పాటు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద వర్గాలు కూడా ప్రైవేటు పాఠశాలల్లో విద్య నభ్యసిస్తే తమ పిల్లలు వృద్ధిలోకి వస్తారనే ఆశతో ఎంత కష్టమైనా భరించి వారిని ప్రైవేట్ ప్రైవేట్ లో చేర్పించడం జరుగుతుంది. ఇక్కడే ప్రైవేట్ పాఠశాలలు అన్ని అవకాశాలను ఉపయోగించుకొని ప్రతి ఏటా ఫీజులను పెంచుతూపోతున్నాయి. భద్రాద్రి జిల్లాలో ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో ఏదో కొత్తదనమంటూ ఫీజులను పెంచేస్తున్నారని తెలుస్తుంది. పాఠశాలల మధ్య ఎంత పోటీ ఉన్నా ఫీజుల విషయంలో మాత్రం అందరూ కఠినంగానే వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను అడ్డగోలుగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం మోగుతున్నాయనే అపవాదు లేకపోలేదు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో తల్లిదండ్రుల ఖజానాను ఖాళీ చేస్తున్నాయి.

**నియంత్రణ లేని ఫీజులు..**
జూన్ మాసం రాకమునుపే ఆయా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు, డొనేషన్ల దందా విచ్చలవిడిగా నడుస్తుందనేది పక్కా సమాచారం. ముందస్తు ప్రచారం, అడ్మిషన్ల పేరిట తల్లిదండ్రుల వద్ద దోచుకో వద్దని ప్రభుత్వం చెబుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు పెడచెవిన పెడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని విని యోగించుకొని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ ను ప్రతి సంవత్సరం పోతున్నాయి. ఇక ఆయా పాఠశాలలకు తోక పేర్లను తగిలించుకొని తమ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉందని ప్రత్యేక తర్ఫీదు పొందిన ఉపాధ్యాయ బృందం ఉందని స్పెషల్ క్లాస్ లు ఉంటాయని తల్లిదండ్రులను బురిడి కొట్టించి అందినకాడికి లాగు తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. టెక్నో, గ్లామర్, మోడల్, డీజీ, కాన్సెప్ట్ వంటి తోక పేర్లు తగిలించుకొని ప్రత్యేక ఫీజులు వసూలు



చేస్తున్నాయనే అపవాదు ఉంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కానీ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల విషయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తూ దోచుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డు, అదుపు లేని ఫీజుల వసూళ్లతో విద్యార్థుల తల్లిదండ్రులు మోయలేని భారంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం ఇంకా కఠినంగా ఫీజుల నియంత్రణ విషయంలో చట్టం తీసుకురావాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**పుస్తకాల ధరలు ఆకాశంలో**
ప్రైవేటు పాఠశాలలో ఉపయోగిస్తున్న పుస్తకాలకు సంబంధించి ధరలుచూస్తే విస్తుపోవాల్సిందే. గతేడాది నర్సరీ, యూకేజీ, ఎల్ కేజీ చదివే పిల్లలకు రూ. 3వేల లోపే పుస్తకాలు, నోట్స్ లు వచ్చేవి. రూ. 3వేలకు తగ్గకుండా పుస్తకాలు, నోట్ పుస్తకాలు తీసుకున్నారు. ఈసారి అవి అమాంతం పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుత మార్కెట్ లో పేపర్ ధర రెట్టింపు కావడంతో ఈ విద్యా సంవత్సరం పుస్తకాలు, నోట్ పుస్తకాల ధరలు అమాంతం పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే కొన్ని పాఠశాలల యాజమాన్యాలు మాత్రం పుస్తకాలు, నోటు పుస్తకాలను తమ పాఠశాలల్లోనే కొనాలని నిబంధనలు విధిస్తున్నాయని సమాచారం. మరి కొన్ని పాఠశాలలు కొన్ని బుక్ స్టాల్ లలో తమ పాఠశాలలకు చెందిన పుస్తకాలు, నోట్స్ లు, మెటీరియల్ కొనుగోలు చేయాలని చెబుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులకు ఇచ్చిన వచ్చిన బుక్ స్టాల్స్ లలో కొనుగోలు చేస్తే ఎంతో కొంత బేరం ఆడితే



రేట్లను కొంతైనా తగ్గించే వారని పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన బుక్ స్టాల్స్ లలో కొనుగోలు చేస్తేవ అడిగినంత ఇవ్వాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది కూడా తమకు మోయలేని ఆర్థిక భారమేనని ఆందోళన చెందుతున్నారు.

**బ్యాగులు, షూస్ అన్ని భారమే..**
ఈ విద్యా సంవత్సరం మార్కెట్ లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్ ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడం తల్లిదండ్రులకు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటుంటే తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదన్న భావనతో తమ ఆర్థిక పరిస్థితి అంతగా లేకున్నా ఋణమో, తృణమో తెచ్చి తమ పిల్లలకు తల్లిదండ్రులు అన్ని రకాల వస్తువులను సమకూరుస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మార్కెట్ లో అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రులు మరింత ఆర్థిక భారం కానుంది. ఏది ఏమైనా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం మరింత కఠినంగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# తెలుగు భాషా వైభవం చాటేలా ప్రపంచ సాహితీ మహాసభలు

## - గోడపత్రికలను ఆవిష్కరించిన భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్

**భద్రాచలం టౌన్, జూన్ 3 ప్రజాజ్యోతి**
తెలుగు సాహిత్య, సాంస్కృతిక చైతన్యాన్ని వెలికితీయడంలో ప్రపంచ తెలుగు సాహితీ మహాసభలు కీలక పాత్ర పోషిస్తాయని భద్రాచలం డీఎస్పీ ఎం.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో రాజమండ్రిలోని గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా జరగనున్న '7వ ప్రపంచ తెలుగు సాహితీ మహాసభల' గోడపత్రికలను బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తెలుగు జాతి వైభవాన్ని కాపాడటంతో పాటు, మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి సభలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలు దిగ్విజయంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు.5 వేల మంది సాహితీవేత్తల రాక ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రపంచ తెలుగు మహాసభల సమన్వయకర్త, స్వర్ణ నంది గ్రహీత సురేష్ బాబు, తోటమల్ల మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభలకు దేశ విదేశాల నుండి సుమారు ఐదు వేల మంది కవులు, రచయితలు, కళాకారులు మరియు సాహితీవేత్తలు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, అధ్యాపకులు అర్జా భిక్షం రావు, బద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయిలో మెరిసిన మోత్కుపల్లి పంచాయతీ

**డీడీయూపీఎస్వీపీ అవార్డులో మూడో స్థానం**

**కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్, సర్పంచ్**

వికారాబాద్ ప్రతినిధి, జూన్ 3( ప్రజా జ్యోతి): వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన "దీన్ దయాళ్





ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ (డి డి యు పి ఎస్ విపి)" అవార్డులో మూడో ర్యాంక్ సాధించి జిల్లాకు గౌరవాన్ని తీసుకు వచ్చింది. "పంచాయత్ విత్ గుడ్ గవర్నెన్స్" అనే విభాగంలో ఈ అవార్డు లభించడం గ్రామ పాలనలో పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలలో మోత్కుపల్లి పంచాయతీ సాధించిన విజయానికి నిదర్శనంగా నిలిచింది. న్యూఢిల్లీ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్), కేంద్ర సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘెల్ ఈ అవార్డును ప్రదానం చేశారు. వికారాబాద్ జిల్లా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ బైండ్ల అమృతమ్మ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## రూమ్ ఆఫ్ కైండ్ నెస్ తో ఎంతో ఉపయోగం: డైరెక్టర్ డా. మధుసూదన్ రెడ్డి

రంగారెడ్డి జూన్ 3 (ప్రజా జ్యోతి) రూమ్ ఆఫ్ కైండ్ నెస్ తో పేదలకు ఎంతో ఉపయోగం అని ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్ డా. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఏం



ఏం సి ఆధ్వర్యంలో ఓజోన్ హాస్పిటల్ సహకారంతో చిత్రా లేఔట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ద్వారా రూమ్ ఆఫ్ కైండ్ నెస్ ని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరార్థుల కోసం పాత బట్టలు, ఇతర వస్తువులు అందులోనుండి తీసుకునే విధంగా ఏర్పాటు చేసారు. ఇంట్లో ఉపయోగించని వస్తువులను ఈ రూమ్ ఆఫ్ కైండ్ నెస్ లో ఉంచితే లేనివారు ఉపయోగించుకుంటే ఎందుకు వీలుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ డిప్యూటీ కమీషనర్ శ్రీకాంత్, ఎల్బి నగర్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, అధికారులు డి ఇ చందన, బుచ్చయ్య, ఏ ఈ షరీఫ్, ఓజోన్ హాస్పిటల్ పిఆర్ఓ రవీందర్ రెడ్డి,కాలనీ వాసులు సెక్రటరీ గణేష్, సత్యనారాయణ రెడ్డి, రంగారావు, కిషోర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,తిరుపతి రావు,రవికుమార్, అంజల్ రావు, రాధిక,శానిటేషన్ సిబ్బంది కొండల్ రెడ్డి, కీర్తన పాల్గొన్నారు.

## ప్రిన్స్టన్ విద్యా సంస్థలకు సుప్రీం మొట్టికాయలు

**అమెరికా యూనివర్సిటీ పేరు వాడటంపై ఆంక్షలు**

**తక్షణం సంబంధం లేదంటూ ప్రకటన విడుదలకు ఆదేశం**

న్యూఢిల్లీ,జూన్3(ప్రజాజ్యోతి): అమెరికాలో ఉన్న ప్రిన్స్టన్ యూనివర్సిటీ పేరు వాడుతుండటంపై తెలంగాణలోని ప్రిన్స్టన్ విద్యాసంస్థలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ యూనివర్సిటీకి తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీని ఆదేశించింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికల్లో కనీసం పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించింది .అమెరికా యూనివర్సిటీ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ 'ప్రిన్స్టన్' పేరుతో కాలేజీలను నడుపుతోంది. తమ ట్రేడ్‌మార్క్‌ను వినియోగిస్తున్న వాగ్దేవి సంస్థలపై అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ప్రిన్స్టన్ యూనివర్సిటీ' కేసు పెట్టింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. కాలేజీ వెబ్‌సైట్లలో అందరికంటే పెద్ద అక్షరాలతో 'డిస్‌క్లెయిమర్ నోటీసు' స్పష్టంగా ప్రదర్శించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, ఇతర అన్ని పత్రాలు, ఫారాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది. నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్ల పక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

**–అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి –ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**

హైదరాబాద్, జూన్ 03(ప్రజాజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా




వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయా



రని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు



నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంతీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.

నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

## మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

**అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు**

హైదరాబాద్,జూన్3(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

## సమస్యల పరిష్కారానికి కృషి: చిలుక ఉపేందర్ రెడ్డి

ఇందర్ రెడ్డి జూన్ 3 (ప్రజా జ్యోతి) : మహేశ్వరం నియోజకవర్గం ఉమ్మడి ఆర్కె పురం డివిజన్ పరిధిలో కాలనీలలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి



అన్నారు. బుధవారము ఎన్టీఆర్ నగర్లోని సాయిబాబా నగర్ లో వేసవి కాలంలో నీటి కొరత వుందని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఉపేందర్ రెడ్డి సంబంధిత వాటర్ వర్క్స్ అధికారి డి జి ఎం చంద్రు నాయక్, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించి సమస్యలను కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, టిపిసిసి ప్రతినిది దే ప భాస్కర్ రెడ్డి ల సహాయ సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హరిబాబు, శ్రీనాథ్, మహేష్, సందీప్, లోకేష్, నర్సింగ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం

**ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?**

**రాజకీయ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ తెలంగాణ టీడీపీ నేతలు**

హైదరాబాద్,జూన్ 3(ప్రజాజ్యోతి): ఎన్టీఆర్ పార్టీ ప ఎట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60-70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967